బుధవారం
29-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 157
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలకు సుప్రీం ఓకే

న్యూదిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. దీనిపై స్టే విధిస్తూ పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీం కోర్టు పక్కనపెట్టింది. స్టే వల్ల ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని హైకోర్టు గ్రహించలేకపోయిందని వ్యాఖ్యానించింది. రివైజ్డ్ నోటిఫికేషన్ జారీచేసి ఎన్నికలను పూర్తి చేయెుచ్చని రిటర్నింగ్ అధికారిని జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న హరియాణా రెజ్లింగ్ సమాఖ్య రిట్ పిటిషన్ తీర్పునకు లోబడి ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం ధర్మాసనం తెలిపింది.

వైసీపీ సర్కార్‌కు సుప్రీంలో చుక్కెదురు

- 17ఏపై తీర్పు వచ్చాకే చంద్రబాబు బెయిల్ రద్దుపై వాదనలు వింటాం
- తదుపరి విచారణ డిసెంబరు 8కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో 17ఏపై తీర్పు వెలువడిన తర్వాతే టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై వాదనలు వింటామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. స్కిల్ కేసులో చంద్రబాబుకి హైకోర్టు మంజూరు చేసిన రెగ్యులర్ బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం మంగళవారం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేసింది. రాజకీయ ర్యాలీలు, సభలు, సమావేశాలూ నిర్వహించకుండా చంద్రబాబును కట్టడి చేయాలన్న సీఐడీ అభ్యర్థనను సుప్రీం తోసిపుచ్చింది. స్కిల్ కేసుపై మాత్రం చంద్రబాబు బహిరంగంగా వ్యాఖ్యలు చేయరాదని సుప్రీం తేల్చిచెప్పింది. రెండు పక్షాలూ స్కిల్ కేసు గురించి బహిరంగంగా వ్యాఖ్యానాలు చేయరాదని పేర్కొంది. రాజకీయ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి చంద్రబాబుకు అనుమతినిచ్చింది. అలాగే మధ్యంతర బెయిల్ సమయంలో ఏపీ హైకోర్టు విధించిన షరతులను కొనసాగించాలన్న సీఐడీ అభ్యర్థనపై కూడా న్యాయస్థానం అభ్యంతరం తెలిపింది.

ఏపీ సీఐడి పిటిషన్‌లో కీలక అంశాలు

చంద్రబాబుకు బెయిల్ మంజూరు విషయంలో హైకోర్టు

- మిగతా 2 లో

ఎన్నికల క్రీడ!

- యువతను ఆకర్షించడానికి కొత్తవ్యూహం
- 'ఆదుదాం ఆంధ్ర'తో ఓట్ల వేట
- జగన్ ఎత్తుగడలపై విపక్షాల మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యువతను ఆకర్షించేందుకుగా 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల ముందు యువత ఓట్లపై వైసీపీ దృష్టి కేంద్రీకరించింది. ఇంతకాలం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ఆటల పేరుతో తలా నాలుగు కిట్లు ఇచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమానికి తెర లేపింది. ఉద్యోగాలు, ఉపాధి కల్పన లేనందున నిరుద్యోగ యువత నిరుత్సాహంగా ఉంది. వారిని ఎలాగైనా ఉత్సాహపరిచి, తమ వైపునకు తిప్పుకునేందుకు కంటి తుడుపు చర్యగా 'ఆడుదాం ఆంధ్ర'కు శ్రీకారం చుట్టింది. రాబోయే ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పొందేందుకు ప్రభుత్వం ఆరాట పడుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాయాల నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో వేర్వేరుగా పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ అధ్వర్యంలో డిసెంబరు 15 నుంచి జనవరి 3 వరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడలకు ప్రణాళిక రూపొందించారు. 15 ఏళ్లు పైబడిన యువతను క్రీడల్లో ప్రోత్సహించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, తెరచాటున రాజకీయ కోణం కన్పిస్తోంది. పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా మైదానాల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ క్రీడాంశాలకు సంబంధించి గ్రామ/వార్డుస్థాయిలో పది మంది వలంటీర్లను ఎంపిక చేసి ఐదు క్రీడాంశాలకు సంబంధించిన పోటీల నియమనిబంధనలపై శిక్షణ ఇస్తారు. డిసెంబరు 15వ తేదీన ఆర్భాటంగా ఈ క్రీడలు ప్రారంభమై... జనవరి 3వ తేదీన విశాఖపట్నంలో ముగియనున్నాయి. ఆయా నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థల ప్రతినిధులు క్రీడల విజయవంతానికి కృషి చేసేలా ప్రభుత్వం ఆదేశించింది.

51 రోజుల క్రీడా పోటీలు

రాష్ట్రవ్యాప్తంగా 51 రోజులపాటు క్రీడలు కొనసాగుతాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో తదితర ఐదు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. వాటితోపాటు యోగ, టెన్నీకాయిట్, మారథాన్ పోటీలేని క్రీడలూ ఉంటాయి. గ్రామ, వార్డు సచివాలయాల పరిధి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రం, రాష్ట్రస్థాయిలో దాదాపు 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇందులో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో లక్షా 50 వేల మ్యాచ్‌లు, 680 మండలాల్లో లక్షా42వేల మ్యాచ్‌లు, 175 నియోజకవర్గాల పరిధిలో 5,250 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. 26 జిల్లాల కేంద్రాల్లో 312 మ్యాచ్‌లు, తుదకు రాష్ట్రస్థాయిలో 250 మ్యాచ్‌లు ఉంటాయి. తొలి విడత గ్రామ, వార్డుస్థాయి పోటీలు నిర్వహించి, అందులో గెలుపొందిన జట్లను మండలస్థాయికి ఎంపిక చేస్తారు. ఈ పోటీల్లో విజేతలకు ధ్రువీకరణ పత్రాలు, ట్రోఫీ, పతకాలు అందజేస్తారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ క్రీడల్లో పాల్గొనే ఆసక్తిగల యువత నుంచి ఈ నెల 27న రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. ఇందుకోసం1902 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు. ఈ పోటీలను శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ధ్యానచంద్ర పర్యవేక్షిస్తున్నారు. అన్ని జిల్లాల క్రీడా అధికారులు పోటీల నిర్వహణపై దృష్టి పెట్టారు.

వైసీపీ రంగులతో క్రీడా సామగ్రి

పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రిని ప్రభుత్వం సమకూర్చనుంది. అందుకు అనుగుణంగా ఆయా క్రీడా సామగ్రిపై వైసీపీ రంగులు, సీఎం జగన్ చిత్రాలు ముద్రించడం విమర్శలకు దారితీస్తోంది. ఐదు క్రీడాంశాల్లో కావాల్సిన అన్ని సామగ్రిలోనూ ఇదే తరహా రంగులు వేసి ప్రచారానికి దిగింది. ట్రోఫీలపైనా సీఎం బొమ్మలు ముద్రించారు. ఎన్నికలకు ముందు కేవలం యువతను తన వైపునకు తిప్పుకునేందుకు వైసీపీ నానాతంటాలు పడుతోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

జగన్ బొమ్మతో ఉన్న వికెట్లు(స్టంప్‌లు) ఇప్పటికే కొన్ని జిల్లాలకు చేరాయి. బ్యాగ్‌లపైనా వైసీపీ రంగులే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం చూస్తే వైసీపీ తన ప్రచారం కోసమే 'ఆడుదాదం ఆంధ్రా' నిర్వహిస్తోంది. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించిన వివిధ కార్యక్రమాలపైన, ప్రజలకు అందజేసిన కిట్లలోనూ జగన్ బొమ్మలు ఉన్నాయి. గ్రామాల్లో పంచాయతీలకు వైసీపీ రంగులు వేసిన ఘటనపై న్యాయస్థానాలకు వెళ్లగా, వాటికి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. జగనన్న కాలనీలూ వైసీపీ రంగులతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అత్యధికంగా జగనన్న పేరుతోనే ఉన్నాయి.

ఇలా పథకాల నుంచి క్రీడల వరకు వైసీపీ రంగులు, జగన్ బొమ్మలు ఏర్పాటు చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలకు సంబంధించిన కిట్లపై వైసీపీ రంగులు, జగన్ చిత్రాలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి.

అంతా నిశ్శబ్దం

- తెలంగాణలో ప్రచారం పరిసమాప్తం
- రేపటి పోలింగ్‌కు పార్టీల సమాయత్తం
- చివరిరోజు పోటాపోటీగా రోడ్‌షోలు
- ప్రలోభాలు షురూ

2లో

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, సబ్‌స్టేషన్లకు సీఎం జగన్ శంకుస్థాపన

2లో

క్షేమంగా వచ్చేశారు

- 17 రోజుల తర్వాత సొరంగం నుంచి బయటకు
- 41 మంది కార్మికులు ఆరోగ్యంగానే
- ఊపిరి పీల్చుకున్న అధికారులు
- వారి కుటుంబాల్లో ఆనందం
- కూలీలను కలిసిన సీఎం
- విజయవంతమైన అతిపెద్ద సహాయక ఆపరేషన్

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారీ సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులు 17 రోజుల తర్వాత బయటకు వచ్చారు. 400 గంటలకుపైగా సాగిన దేశంలోని అతిపెద్ద సహాయక ఆపరేషన్ విజయవంతమైంది. కార్మికులంతా ఒక్కొక్కరిగా బయటకు రాగా, వారంతా ఆరోగ్యంగా ఉండటంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. సొరంగం నుంచి స్ట్రెచర్లతో కార్మికులను బయటకు తీశారు. అక్కడే ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య కేంద్రానికి తరలించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సొరంగం నుంచి బయటకు వచ్చిన కార్మికులను సీఎం పుష్కర్ సింగ్ ధామి కలిశారు. వారి క్షేమ సమాచారం తీసుకున్నారు. కార్మికులంతా ఆరోగ్యంగా ఉన్నారని అధికారి ఒకరు చెప్పారు. ఒక్కో కార్మికుడు బయటకు వచ్చేందుకు ఐదు నుంచి ఏడు నిమిషాలు పట్టినట్లు వెల్లడించారు. బయటకు వచ్చాక ఊపరితల వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు కార్మికులకు కాస్త సమయం ఇచ్చామని, ఉష్ణోగ్రత 14 డిగ్రీలుగా ఉన్నదని అధికారి చెప్పారు. ప్రతి కార్మికుడిని తాళ్లతో స్ట్రెచ్చర్‌కు కట్టి రాళ్లురప్పల మధ్య నుంచి 60 మీటర్లు లాగినట్లు తెలిపారు. వీరంతా ఈనెల 12న సొరంగంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. కాగా అత్యవసర పరిస్థితుల కోసం చినూక్ హెలికాప్టర్, అంబులెన్సులు సిద్ధంగా ఉంచారు. ఎయిమ్స్ రిషికేశ్‌లోనూ ఐసీయూ, ట్రామా సెంటర్‌లో పడకలు సిద్ధం చేశారు. తొలుత సహాయక చర్యలు రాత్రంతా సాగవచ్చని జాతీయ విపత్తు నివారణ యంత్రాంగం (ఎన్డీఎంఏ) సభ్యుడు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ హసేన్ అన్నారు. 'వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ సైతం కార్మికుల కోసం సిద్ధంగా ఉన్నది. చిన్యాలిసార్ వద్ద వైద్య కేంద్రం సమీపంలో దీనిని ఉంచారు. బయటకు వచ్చిన వెంటనే కార్మికులను ఈ కేంద్రానికి తరలిస్తారు' అని అన్నారు. పైపులు వేయడం పూర్తి అయిందని, త్వరలోనే కార్మికులంతా బయటకు వస్తారని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ ధామి ఉదయం ట్వీట్ చేశారు. వైద్య కేంద్రంలో సరైన చికిత్స అందించలేని పక్షంలో ఎయిమ్స్‌కు కార్మికులను తరలిస్తారని ఎయిమ్స్ రిషికేష్‌కు చెందిన సీనియర్ వైద్యుడు తెలిపారు. ట్రామా సెంటర్‌లో 20 పడకలు, ఐసీయూలో కొన్నింటిని

- మిగతా 2 లో

మరో రెండు రోజులు కాల్పుల విరమణ

ఇజ్రాయిలీ నౌకలపై దాడి చేయలేదు: ఇరాన్

2లో

బీజేపీకి మోదీ దెబ్బ!

- ప్రధాని హోదాలో ప్రచారార్భాటం
- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తీరు
- బీజేపీకి ఎదురుగాలే అంటున్న విశ్లేషకులు

న్యూదిల్లీ : దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారం చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మతోన్మాద, విధ్వంసకర వైఖరులనే అవలంబిస్తున్నాడు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, కార్పొరేట్ శక్తులకు అతి తక్కువ ధరకు కట్టబెడుతున్నాడు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించకపోగా, ఉన్న వాటిని ఊడగొట్టే చర్యలకు ఒడిగడుతున్నాడు. దీంతో మోదీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగింది. కాషాయ పాలనకు చరమగీతం పాడాలని ఇప్పటికే వారు కంకణబద్ధులయ్యారు. ఈ నేపథ్యంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో అంతా మోదీ అన్నట్లు ప్రచారం సాగుతుండటంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది బీజేపీని దిగజారుస్తుందే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అద్భుతం..ఎవరికీ దొరక్కుండా బ్రహ్మాండంగా ఓటర్లకు నోట్లు పంచేశాం!

బీజేపీ, వైసీపీలకు గుణపాఠం తప్పదు

- ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి
- ఉద్యమాలపై ఉక్కుపాదం సహించం
- అక్రమ కేసులు సరికాదు
- కార్మిక, కర్షక నేతల హెచ్చరిక
- విజయవంతంగా ముగిసిన మహాధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజావ్యతిరేక విధానాలు విడనాడకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రైతు, కార్మికసంఘాల నేతలు హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి, కార్మికసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో మంగళవారం జరిగిన రెండోరోజు మహాధర్నాలోనూ రైతులు, కార్మికులు, శ్రామికులు, వ్యవసాయ కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల మహాధర్నా విజయవాడ జింఖానా మైదానంలో విజయవంతంగా కొనసాగింది. ధర్నాకు రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతుసంఘం

- మిగతా 2 లో

వణికిన మూడు దేశాలు

నిమిషాల వ్యవధిలో భూకంపాలు
పాకిస్తాన్, న్యూగినియా, టిబెట్‌లో నమోదు

ఇస్లామాబాద్: కొద్ది నిమిషాల వ్యవధిలోనే మూడు వేర్వేరు దేశాల్లో భూకంపాలు నమోదయ్యాయి. పాకిస్తాన్, న్యూగినియా, టిబెట్ ప్రాంతంలో భూకంపాలు చోటుచేసుకున్నాయి. పాకిస్తాన్‌లో 4.2 తీవ్రతతో మంగళవారం తెల్లవారుజామున 3.38 గంటలకు భూకంపం సంభవించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. భూకంప కేంద్రాన్ని 34.66 డిగ్రీల ఉత్తర అక్షాంశం.. 73.51 డిగ్రీల తూర్పు రేఖాంశం మధ్య 10 కి.మీ. లోతులో గుర్తించినట్టు పేర్కొంది. పపువా న్యూగినియా తీరంలో భూకంపం తెల్లవారుజామున 3.16 గంటలకు వచ్చిందని తెలిపింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం భూకంప తీవ్రతను 6.6గా నమోదైంది. ఆస్ట్రేలియా వాతావరణ విభాగం మాత్రం ఈ భూకంపం వల్ల తమ తీరానికి ప్రస్తుతం సునామీ ముప్పు లేదని పేర్కొంది. చైనా సరిహద్దుల్లో టిబెట్ లేదా జియాంగ్‌లో తెల్లవారుజామున 3.45 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో భూకంపం సంభవించిందని, భూకంప కేంద్రం 140 కి.మీ. లోతున ఉన్నట్టు గుర్తించినట్టు వెల్లడించింది.

1న అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్ విచారణ

ఇస్లామాబాద్: సైఫర్ కేసులో పాకిస్తాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్, వైస్ చైర్మన్ షా మహమూద్ ఖురేషి విచారణ అడియాలా జైలులో జరగనున్నట్లు ప్రత్యేక కోర్టు మంగళవారం ప్రకటించింది. అడియాలా జైలు సూపరింటెండెంట్ భద్రతా నివేదిక దృష్ట్యా విచారణను జైలులో నిర్వహించాలని నిర్ణయించినట్లు కేసును విచారించిన జడ్జి హస్నత్ జుల్‌కర్‌నైన్ తెలిపారు. తదుపరి విచారణ డిసెంబరు ఒకటో తేదీన అడియాలా జైలులో జరుగుతుందని అన్నారు. జర్నలిస్టులతో పాటు ఎవరైనా హాజరు కావచ్చని, నిందితుల కుటుంబాల నుంచి ఐదుగురు హాజరు అయ్యేందుకు అనుమతి ఉంటుందని కోర్టు తెలిపింది.

మరో రెండు రోజులు కాల్పుల విరమణ
ఇజ్రాయిలీ నౌకలపై దాడి చేయలేదు: ఇరాన్

జెరూసలేం/టెహ్రాన్: గాజాలో కాల్పుల విరమణను ఈనెల 30 వరకు పొడిగించారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ఇది అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఒప్పందం కుదిరినట్లు ఖతార్ సోమవారం రాత్రి ప్రకటించింది. ఇంతకుముందు అంగీకరించినట్లుగానే తాజా పొడిగింపు కాలం ఉంటుందని పేర్కొంది. మరోవైపు ఉత్తర, తూర్పు గాజాలో కాల్పులు జరిగాయి. కాల్పుల విరమణ అమల్లో ఉన్నాగానీ షేక్ రద్వాన్ జిల్లాలో కాల్పులు జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఉత్తర గాజాస్ట్రిప్ గగనతలంలో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు తిరిగాయన్నారు. ఇదిలావుంటే ఇజ్రాయిల్‌కు సంబంధించిన నౌకలపై దాడుల వెనుక తమ ప్రమేయం లేదని ఇరాన్ స్పష్టంచేసింది. ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ నౌకలపై జరిగిన దాడులతో తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నాసెర్ కనానీ తెలిపారు. ఈనెల 19న ఇజ్రాయిల్ మొదటి నౌకను స్వాధీనం చేసుకున్నది తామేనని యమన్ హౌతీలు అంగీకరించినట్లు చెప్పారు. ఆదివారం ఇజ్రాయిలీ ఓఫర్ కుటుంబానికి సంబంధించిన బ్రిటన్ నౌక నిర్వహణ సంస్థకు చెందిన మరో నౌకను ఆదివారం గుర్తుతెలియని అడ్డుకున్నారు. దానిపై దాడి చేశారు.అమెరికా నేవీ సాయంతో ఆ నౌక విడుదలైంది.

33 మంది పలస్తీనియన్ల విడుదల

ఇజ్రాయిల్ చెర నుంచి ఖైదీల నాల్గో బృందం విడుదలైంది. హమాస్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం దశలవారీగా ఖైదీలను విడుదల చేస్తున్నారు. తాజాగా 33 మంది పలస్తీనియన్లను ఇజ్రాయిల్ విడిచిపెట్టింది. ఈ మేరకు అల్ జజీరా మంగళవారం నివేదించింది. హమాస్ విడిచిపెట్టిన 11 మంది ఇజ్రాయిలీలు తమ భూభాగానికి చేరుకున్నట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) సోమవారం ప్రకటించింది. ఇప్పటివరకు 150 మంది పలస్తీనియన్లు ఇజ్రాయిల్ జైళ్ల నుంచి విడుదలైనట్లు వార్తాసంస్థ తెలిపింది.

అంతా నిశ్శబ్దం
తెలంగాణలో ప్రచారం పరిసమాప్తం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. మంగళవారం సాయంత్రం 5గంటలతో తెలంగాణ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం తరువాత ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు ఎవరూ కూడా అయా నియోజకవర్గాల్లో ఉండేందుకు వీలు లేకపోవడంతో ప్రచారానికి వచ్చిన వారంతా నియోజకవర్గాలను వీడారు. రాష్ట్రంలో గత నెల రోజులుగా వివిధ రాజకీయ పక్షాల నాయకులు ప్రచారంతో హోరెత్తించారు. చివరి రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో కూడా భారీ రోడ్ షో కార్యక్రమాలు నిర్వహించి తమ బలాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా చాలా చోట్ల ట్రాఫిక్ స్తంభించి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. గడిచిన నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు కూడా నువ్వానేనా అనే రీతిలో పోటీపడి ప్రచారం నిర్వహించారు. చివరి మూడు రోజులు మాత్రం అగ్రనాయకుల తాకిడితో తెలంగాణ ప్రచారం ఉధృతంగా సాగింది. ఓవైపు బీజేపీ తరపున ప్రధాని మోదీ, అమిత్‌షా, యోగి ఆదిత్యనాథ్ పర్యటించి ఓటర్లను అకర్షించే ప్రయత్నం చేయగా... మరోవైపు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరపున ప్రచారం ఉధృతం చేశారు. అదే సమయంలో బీఆర్ఎస్ తరపున పార్టీ అధినేత కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రచారం సాగించారు. మంగళవారం సాయంత్రం ప్రచార గడువు ముగియడంతో మైకులు మూగవోయాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు అంతటా నిశ్శబ్దం అలుముకుంది. అయితే ఈసారి ఎన్నికలు అభ్యర్థులకు ఆర్థికంగా పెనుభారంగా మారాయనే చెప్పాలి.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

మొత్తానికి నెల రోజుల ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో ఇప్పుడు నేతలంతా గురువారం జరిగే పోలింగ్‌పై దృష్టి సారించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే అనేక చోట్ల డబ్బులు పంపిణీ చేసే పనిలో అన్ని పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులైతే ఇప్పటికే గ్రామాలలో డబ్బు పంపిణీని ప్రారంభించారు.

డబ్బుతో పాటు మద్యం కూడా గ్రామాలలో ఏరులై పారుతోందనే చెప్పాలి. ఓటుకు రూ.5వేల వరకు కూడా ఇచ్చేందుకు అయా పార్టీల నాయకులు వెనుకంజ వేయడం లేదు. గ్రామాల వారీగా ఇప్పటికే జాబితాలను తయారు చేసుకున్న అయా పార్టీల నాయకులు ఏ వర్గం ప్రజలలో వ్యతిరేకత ఉంది... వారిని ఏ విధంగా తమవైపు మలుచుకోవాలనే విషయంలో ఆరాలు తీశారు. పోలింగ్‌కు కేవలం ఒకే రోజు గడువు ఉండడంతో చివరి రోజు ఎలాగైన వారిని తమదారిలోకి తెప్పించుకుని ఓట్లను వేయించుకునేందుకు అన్ని రకాలుగా సిద్ధమయ్యారు. మంగళవారం సాయంత్రం నుండి గ్రామాలలో పెద్దఎత్తున పోల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన లాబీయింగ్ జరుగుతోంది. అదేవిధంగా ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నాయకులను కూడా చివరి నిమిషంలో తమవైపు తిపుకోవడం ద్వారా ఓట్ల సంఖ్యను పెంచుకునే అవకాశాలను కూడా అయా పార్టీల నాయకులు వదులుకోవడం లేదు. ఎన్నికల సందర్భంగా ఇప్పటికే అభ్యర్థులు డబ్బులను విచ్చల విడిగా ఖర్చు చేశారు. ఎక్కడ సభలు జరిగినా, సమావేశాలు జరిగినా, చివరకు ఎన్నికల ప్రచారానికి కూడా ప్రజలకు డబ్బులు ఇచ్చి మరి రప్పించారు.

డబ్బుతో పాటు మద్యం కూడా ఈ సారి ఎన్నికల ప్రచారంలో ఏరులై పారింది. ఇలాంటి సందర్భంలో చివరి నిమిషంలో ఖర్చు విషయంలో వెనక్కు తగ్గితే ఇన్ని రోజులు పడిన శ్రమ అంతా వృథా అవుతుందనే భావన వారిలో వుంది. అలాగే పార్టీ అధిష్టానాలు కూడా ఖర్చు విషయంలో వెనకడుగు వేయకూడదని సూచనలు చేసినట్టు సమాచారం.

బీజేపీకి మోదీ దెబ్బ!

(మొదటిపేజీ తరువాయి)

తప్పు... మోదీ ప్రతిష్ఠ కలిసొస్తుందనే కాషాయ పార్టీ సూత్రం ఫలించదనే అంటున్నారు. 2023 ముగింపు నాటికి ఐదు రాష్ట్రాలు కొత్త శాసనసభలను ఎన్నుకుంటాయి. మిజోరం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రచారానికి నరేంద్ర మోదీ మళ్లీ ముఖంగా ఉన్నారు. మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణల్లో బీజేపీకి అవకాశాలు అంతగా లేవని, రాజస్థాన్‌లో గట్టి పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నప్పటికీ ఇది జరిగింది. ఎన్నికల ప్రచార సరళి మోదీ వర్సెస్ మిగిలిన వారు అన్నట్టుగా చూపించాలన్నది బీజేపీ తాపత్రయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో బీజేపీ ఘోరంగా ఓడిపోయిన కర్నాటక నుంచి ఎలాంటి పాఠాలూ నేర్చుకోలేదని వారు చెబుతున్నారు. అక్కడ కూడా మోదీ... బీజేపీ ప్రచారానికి నాయకత్వం వహించి ఎన్నికలను తనవైపు తిప్పుకున్నారు. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆ నష్టాన్ని మరచిపోకముందే మరోసారి ప్రస్తుత ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ తానే కేంద్ర బిందువుగా బీజేపీ తరపున మోదీ ప్రచారానికి దిగారు. ఒక కారణం ఏమిటంటే, 2014 నుంచి ప్రధాని హోదాలో మోదీ ప్రజల్లో అంతా తానే అన్నవిధంగా రాజరికాన్ని ప్రదర్శించే ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందుకు ఆయన ఎన్నికల ప్రచార శైలినే వారు ఉదహరిస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలనే కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆయన ప్రధాని హోదాలో ప్రచారాలకు వెళ్లారని, బహిరంగ సమావేశాల్లోనూ, ర్యాలీల్లోనూ చర్చ అనేది తాను కేంద్రంగా జరగాలన్నది బీజేపీ, మోదీ తాపత్రయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మోదీ తనపై ఎన్నికల దృష్టిని కేంద్రీకరించడానికి కారణం... తనను తాను 'అభివృద్ధి మనిషి (వికాస్‌పురుష్)' గా చూపించుకోవడమేనని చెబుతున్నారు. ఒకవేళ అవసరమనుకుంటే బీజేపీకి ఆయుధమైన మతం అనే సున్నితమైన అంశాన్ని ప్రధాని హోదాలో ప్రస్తావించి కాషాయ పార్టీకి ఓట్లు తీసుకురావటమూ ఒక వ్యూహమని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. మోదీ... కర్నాటక ఎన్నికల్లో 'భజరంగ్‌బలి' అంటూ భజరంగ్‌దళ్‌కు అనుకూలంగా నినాదాలు తీసుకువచ్చాడని, అయినప్పటికీ ప్రజల్లో అనుకున్నంత స్పందన రాకపోగా... ఆ ఎన్నికల్లో బీజేపీ చతికలపడిందని వారు గుర్తు చేస్తున్నారు.

మోదీ మీద ఆధారపడితే బీజేపీకి నష్టమే

మోదీ కేంద్రంగా సాగే ఈ తరహా ప్రచారం వల్ల భవిష్యత్తులో బీజేపీ రాజకీయంగా తీవ్ర నష్టాన్ని ఎదురు చూడక తప్పదు. బీజేపీలో మోదీకి ప్రత్యామ్నాయంగా ఎవరూ లేరని, అసెంబ్లీ, స్థానిక ఎన్నికలకు సైతం ఆయనే రావాల్సిన పరిస్థితులు ఆ పార్టీలో ఏర్పడ్డాయి. అయితే, ప్రధాని స్థాయిలో ఆయన తన శక్తినంతా వినియోగించినప్పటికీ కాషాయ పార్టీకి చేదు ఫలితాలే ఎదురవుతున్నాయి. మోదీ హవా ఉన్నదని చెబుతున్న సమయంలో 2015లో దిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. ఆ పార్టీ 31 సీట్ల నుంచి కేవలం మూడు స్థానాలకు పడిపోయిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే ఇది కేవలం స్థానిక సమస్యలపై జరిగిన రాష్ట్ర ఎన్నికలని, మోదీపై రెఫరెండంగా చూడకూడదని బీజేపీ హడావుడి చేసింది. ఆ తర్వాత వచ్చిన బీహార్ ఎన్నికల్లోనూ బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోలేకపోయింది. దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తి అంటూ బీజేపీ, దాని అనుకూల మీడియా చేస్తున్న ప్రచారాలు వట్టి మాటలేననీ, ఇందుకు అనేక రాష్ట్రాల్లో మోదీ ప్రచారం చేస్తున్నప్పటికీ బీజేపీ ఓటమిపాలవుతుండటమే నిదర్శనం. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు మణిపూర్, మేఘాలయా వంటి ఈశాన్య రాష్ట్రాలలో మోదీ ప్రధాన ప్రచారకర్తగా ఉన్నప్పటికీ బీజేపీ ఓడిపోయిందంటున్నారు. మోదీ శక్తి క్షీణించడాన్ని ఇది సూచిస్తుంది.

మణిపూర్ ఎఫెక్ట్... మిజోరాంకు దూరం

మోదీ తనకు ప్రతికూలంగా ఉన్న రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లడని, ఇందుకు ఈశాన్య రాష్ట్రం మిజోరాం ప్రత్యక్ష ఉదాహరణ అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మిజోరాంలో సైతం అసెంబ్లీ ఎన్నికలు ఉన్నప్పటికీ మోదీ అక్కడ ప్రచారానికి వెనకడుగు వేశాడు. పొరుగున ఉన్న మణిపూర్‌లోని బీజేపీ పాలనలో జాతి ఘర్షణలు చోటు చేసుకోవటం, దానిని నియంత్రించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావటంతో దాని ప్రభావం మిజోరాంలో సైతం పడిందని చెబుతున్నారు. ఈ కారణంతోనే మిజోరాం ప్రచారానికి వెళ్లకుండా మోదీ తప్పించుకుంటున్నారని అంటున్నారు. మిజోరాంలో బీజేపీకి మిత్రపక్షమైన మిజోరాం సీఎం సైతం ప్రధానితో వేదిక పంచుకోవటానికి ఇష్టపడలేదని గుర్తు చేస్తున్నారు.

ఫిరాయింపులతో అధికారం

ఆయా రాష్ట్రాల ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత కూడా కేంద్రంలో ఉన్న తన అధికార బలాన్ని ఉపయోగించి ఫిరాయింపుల ద్వారా ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేసిన బీజేపీ విధానాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అధికార పార్టీ శాసన సభ్యులను 'కొనుగోలు' చేయడం ద్వారా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకున్నదంటున్నారు. మణిపూర్, మధ్య ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీ అధికారాన్ని లాక్కుంది.. బీజేపీ అనుసరిస్తున్న తీరు ప్రజలలో ఆ పార్టీ పట్ల ద్వేషాన్ని మరింత పెరిగేలా చేస్తుందంటున్నారు.

క్షేమంగా వచ్చేశారు...

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అంబులెన్స్‌లో కార్మికుడితో పాటు వారి కుటుంబంలో ఒకరిని అనుమతిస్తామని అధికారులు ఇంతకుముందు వెల్లడించారు. వారి దుస్తులు, బ్యాగులతో సిద్ధంగా ఉండండని కుటుంబ సభ్యులకు తెలిపారు. అంబులెన్స్‌లు వెళ్లేందుకు వీలుగా రోడ్లు మెరుగుపర్చారు. సొరంగంలోకి ఎండోస్కోపి తరహాలోని కెమెరాను, వాకీటాకీలను పంపిన క్రమంలో కార్మికులంతా క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. సహాయక చర్యల్లో అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సాంకేతిక సమస్యలను దాటి సహాయక సిబ్బంది వారి ప్రాణాలను కాపాడగలిగారు. శిథిలాల్లో 57 మీటర్ల పొడవునా గొట్టపు మార్గాన్ని వేయగలిగితే కార్మికుల వద్దకు చేరుకునేందుకు ఆగర్ యంత్రంతో డ్రిల్లింగ్ చేపట్టారు. 47 మీటర్లు తవ్విన తర్వాత యంత్రం పనిచేయలేదు. ప్రత్యామ్నాయంగా కొండపై నుంచి డ్రిల్లింగ్ చేపట్టారు. ఆగర్ మిషన్ శిథిలాలను కట్టర్ సాయంతో తొలగించారు. ఆ తర్వాత 12 మంది 'ర్యాట్ హోల్ మైనర్ల' (బొగ్గు గనుల్లో సన్నని మార్గాలను తవ్వడంలో నిపుణులు)ను రంగంలోకి దించారు. మిగతా డ్రిల్లింగ్ పనిని వీరు మాన్యువల్‌గా చేపట్టారు. సోమవారం రాత్రి నుంచి ఈ ర్యాట్ హోల్ మైనర్లు మెరుపు వేగంతో తవ్వకాలు చేపట్టడంతో 57 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తి అయింది. ఆ తర్వాత కార్మికులున్న ప్రాంతం వరకు గొట్టాన్ని పంపి వారిని బయటకు తీసుకొచ్చారు.

గుణపాఠం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నాయకులు వై.కేశవరావు, జాస్తి కిషోర్, కె.ధనలక్ష్మి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

మహాధర్నాలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామచంద్రయ్య మాట్లాడుతూ ఈ ఏడాది కరువు రాయలసీమతో పాటు కోస్తాను వదలలేదన్నారు. దాదాపు 10 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంట వేయలేదన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. రైతులు బీమా పథకం ఉన్నా కేంద్రం పట్టించుకోవటం లేదని, రైతులు నష్టాలపాలైతే వ్యవసాయాన్ని కార్పొరేట్‌లకు అప్పగించే ఉద్దేశంతోనే ప్రభుతాలు కరువు సహాయ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా సారథ్యంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పనిదినాలు, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధిహామీ క్షేత్రంలో పొందుపరిచిన వాటన్నింటినీ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు మోదీ సర్కారు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పొమ్మనలేక పొగ పెట్టినట్లు బడ్జెట్‌లో ఏటా నిధులు తగ్గిస్తోందని మండిపడ్డారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి కూడా అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాది కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తుచేశారు. పేదలు, రైతులు, కార్మికులు, గిరిజన, సమాచార హక్కు చట్టాలను మోదీ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని విమర్శించారు. శాసనమండలి సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్ల నుండి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని, ఇది చేతకాని ప్రభుత్వమని దుయ్యబట్టారు. కొన్ని సంవత్సరాల నుండి 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి...తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. జాబు ఇవ్వని జగన్‌మోహన్‌రెడ్డి జాబు పీకేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక, సెకండరీ స్థాయిలో విద్యాబోధన తగిన ప్రమాణాలతో ఉండకపోవడం, ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యాబోధన భారం కావడంతో పేదవర్గాల పిల్లలు నాణ్యతతో కూడిన విద్య నేర్చుకోలేకపోతున్నారన్నారు. అటు జగన్‌మోహన్‌రెడ్డి, ఇటు మోదీ పేదలకు విద్యను దూరం చేస్తున్నారని ఆరోపించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 47 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, ఇది అత్యంత దుర్మార్గమన్నారు. మోదీ ఆర్థిక విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని, దీనివల్ల పేద, బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఉండవని, సామాజిక న్యాయం దెబ్బతింటుందని, ప్రభుత్వ రంగసంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఐజేయూ కార్యదర్శి సోమసుందర్ మాట్లాడుతూ మోదీ హయాంలో పత్రిక స్వేచ్ఛ కరువైందని విమర్శించారు. వర్కింగ్ జర్నలిస్టులకు భద్రత లేకుండా చేసిందన్నారు. పనిభద్రత, మెరుగైన వేతనం తదితర అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. పత్రికా స్వేచ్ఛ, పౌర హక్కులు, వాక్ స్వాతంత్ర్యాన్ని బీజేపీ ప్రభుత్వం హరిచివేస్తున్నదన్నారు. ఏడాదిపాటు జరిగిన చారిత్రక రైతు పోరాటానికి సహకరించిందనే అక్కసుతో న్యూస్‌క్లిక్ యాజమాన్యంపై అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. టీడీపీ నాయకురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ రైతులను అన్ని రకాలగా ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని, దీనిద్వారా ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. పెద్దఎత్తున మహిళలు కదిలి వచ్చి ధర్నాలో పాల్గొన్నందుకు అభినందించారు.

రైతు, కార్మిక సంఘాల నాయకులు రావుల వెంకయ్య, జి.ఓబులేసు, వి.ఉమామహేశ్వరరావు, పి.జమలయ్య, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, కుర్రా నరేంద్ర, ఆంధ్రప్రదేశ్ లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, రైతుసంఘం నాయకులు ఎం.వెంకటరెడ్డి, కొల్లా రాజమోహన్, ఇ.ప్రభాకర్‌రెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, తోట ఆంజనేయులు, డి.హరనాథ్, కె.ప్రభాకర్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు పి.అజయ్‌కుమార్, ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకులు ఎ.విద్యాసాగర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.రాధాకృష్ణమూర్తి, కృష్ణాజిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు టి.లక్ష్మణస్వామి, ఎల్ఐసీ నాయకులు కిషోర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కుమార్, నక్కి లెనిన్‌బాబు, వి.వెంకటేశ్వర్లు, నక్క వెంకటేశ్వర్లు, జి.బాలు, ఎంఎస్ఎం మాజీ సలహాదారులు వైవీఎస్ మహదేవ్, సింహాద్రి ఝాన్సీ, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎన్.లక్ష్మణరావు, కార్మికసంఘం నాయకులు, సి.భాస్కరరావు, లలిత తదితరులు పాల్గొన్నారు. 37 అంశాలపై వక్తలు ప్రసంగించి తీర్మానాలు ప్రవేశపెట్టగా...మహాధర్నా ఏకగ్రీవంగా ఆమోదించింది. రెండు రోజుల పాటు జరిగిన ధర్నాలో ఉభయ ప్రజానాట్యమండలి, ఉభయ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల ఆటలపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళా ప్రదర్శనలు అద్భుతమనిపించాయి. మహాధర్నా జయప్రదానికి సహకరించిన అందరికీ నాయకత్వం ధన్యవాదాలు తెలియజేసింది.

వైసీపీ సర్కార్‌కు సుప్రీంలో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

పరిధి దాటింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలను అతిక్రమించింది. కేసు లోతుల్లోకి వెళ్లి క్లీన్ చిట్ ఇచ్చే ప్రయత్నం చేసింది. ట్రయల్ కోర్టును ప్రభావితం చేసేలా హైకోర్టు తీర్పు ఉంది. 39 పేజీల తీర్పు మినీ ట్రయల్ నిర్వహణ జరిగిందనడానికి నిదర్శనం. దుర్వినియోగం చేసిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి వెళ్లాయి. అందుకు పూర్తి ఆధారాలున్నా హైకోర్టు ఏ మాత్రం పట్టించుకోలేదు. చంద్రబాబుకు రాజకీయ పలుకుబడి ఉంది. సాక్షులను బెదిరించడం ద్వారా దర్యాప్తును ప్రభావితం చేస్తారు. హైకోర్టు తేల్చిన అంశాలు వాస్తవ విరుద్ధం. చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ సుప్రీంకోర్టులో తేలేంత వరకు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును ఏపీ సీఐడీ కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర ధర్మాసనం స్కిల్ కేసులో క్వాష్ పిటిషన్‌పై తీర్పు వచ్చిన తర్వాత దీనిపై వాదనలు వింటామని వెల్లడించింది.

వైసీపీ కేంద్ర కార్యాలయంలో
ఘనంగా పూలే వర్ధంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు, పార్టీ నేతలు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి అందరికీ సమాన అవకాశాలు కల్పించిన మహనీయుడు జ్యోతిరావ్ పూలే అని నేతలు కొనియాడారు. మంత్రి కారుమూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ... దేశంలో బడుగు, బలహీనవర్గాలకు హక్కులకోసం పోరాటం చేసిన యోధుడు జ్యోతిరావ్ పూలే అన్నారు. పూలే పోరాటాలు అందరికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ లో కులగణన సీఎం జగన్ అధ్వర్యంలోనే సాధ్యమైందన్నారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల్లో జ్యోతిరావ్ పూలే ధైర్యం నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్, దివ్యాంగుల విభాగం కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా కడపలో 750 మెగావాట్ల సామర్థ్యం, అనంతపురంలో 100 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి, 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లను వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. హెచ్‌పీసీఎల్‌తో రూ.10వేల కోట్ల విలువైన ప్రాజెక్టుపై ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను ప్రతి గ్రామానికి, ప్రతిరైతుకు ఇచ్చే పరిస్థితిని, వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు 9 గంటలపాటు పగటిపూటే ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ఇది చేయాలంటే సామర్థ్యం సరిపోదు, ట్రాన్స్‌మిషన్ కెపాసిటీ అభివృద్ధి చేయాల్సి ఉంది. ఆ తర్వాత రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ పగటి పూట ఇచ్చే పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు చెప్పారు. దీనికోసం రూ.1700 కోట్లతో ఫీడర్లను ఏర్పాటుచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను పగటిపూటే ఇస్తున్నాం. దీంతోపాటు రైతులకు ఉచిత విద్యుత్‌ను స్థిరంగా ఇవ్వడానికి రూ.2.49కే యూనిట్ ధరతో సోలార్ పవర్‌ను ఆంధ్రరాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమాన్ని చేపట్టాం. దాదాపు 17వేల మిలియన్ యూనిట్లకు సెకీతో ఒప్పందం చేసుకున్నాం. వ్యవసాయ విద్యుత్‌కు కావాల్సిన 13వేల మిలియన్ యూనిట్లు పగటిపూటే...మరో 25 సంవత్సరాలపాటు రూ.2.49లకే అందుబాటులో ఉండేలా రైతులకు ఎలాంటి ఢోకా లేకుండా ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. ఇవాళ యూనిట్ సగటు ధర రూ.5.30లు పడుతున్న పరిస్థితుల నుంచి రూ.2.49లకే యూనిట్ ధర వచ్చే పరిస్థితుల్లోకి అడుగులు వేస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు 2024కు 3వేల మెగావాట్లు, సెప్టెంబరు 2025 నాటికి మరో 3వేల మెగావాట్లు, సెప్టెంబరు 2026 నాటికి మరో 1000 మెగావాట్లు అందుబాటులోకి వస్తుందని సీఎం వివరించారు. హెచ్‌పీసీఎల్‌తో మరో రూ.10 వేల కోట్ల పెట్టుబడికి సంబంధించి చేసుకున్న ఎంవోయూ వల్ల మరో 1500 మందికి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయని సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కే వీఎస్ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీ బి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య బిల్లుకు కేరళ గవర్నర్ ఆమోదం
రాష్ట్రపతి ఆమోదానికి మరో ఏడు రిజర్వు

తిరువనంతపురం: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి తన వద్ద పెండింగ్ ఉన్న ఎనిమిది బిల్లుల్లో ఒక దానిని కేరళ గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్ ఆమోదించారు. మిగతా ఏడు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వులో పెట్టారు. కీలక ప్రజారోగ్య బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించినట్లు రాజ్‌భవన్ మంగళవారం ప్రకటించింది. రెండు యూనివర్సిటీ సవరణ బిల్లులు సహా లోకాయుక్త బిల్లు, యూనివర్సిటీ బిల్లు 2022, యూనివర్సిటీ సెర్చ్ కమిటీ విస్తరణ బిల్లు, కోఆపరేటివ్ (మిల్మా) బిల్లును రాష్ట్రపతి ఆమోదానికిగాను రిజర్వులో పెట్టినట్లు తెలిపింది. కాగా, శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదముద్ర వేయకుండా రాజ్‌భవన్ వద్ద పెండింగ్ పెట్టుకోవడంపై సుప్రీంకోర్టు విచారణ వేళ ఈ పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ మేరకు కేరళ ప్రభుత్వ ఫిర్యాదును 24వ తేదీన సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించిన విషయం విదితమే.

మోదీ విధానాలు ప్రమాదకరం

బీజేపీ అధికారంలోకి రాకుండా కార్యాచరణ

మహాధర్నాలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ: రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ... మతతత్వాన్ని రెచ్చగొడుతూ... కార్మిక హక్కులను కాలరాస్తూ... వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని వక్తలు ఉద్ఘాటించారు. ఏపీ కార్మిక సంఘాల ఐక్యవేదిక, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి సంయుక్త అధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మహాధర్నాలో నాయకులు ప్రసంగించారు. విజయవాడలోని జంఖానా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా కార్మికసంఘాల నాయకులు, రైతుసంఘాల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. న్యాయవాదులు, మహిళా ఉద్యమకారులు, జర్నలిస్టు సంఘాలు, వివిధ ప్రజాసంఘాల నేతలు మహాధర్నాకు సంఘీభావం ప్రకటించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, నిత్యావసరల ధరల పెరుగుదల, నిరుద్యోగం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు వంటి వివిధ అంశాలపై బీజేపీ విధానాలను నిరసిస్తూ ప్రసంగించారు.

దేశంలోనూ, రాష్ట్రంలోనూ అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. సమస్యలపై స్పందించే ప్రజలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటువంటి అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలి. ప్రజా ఉద్యమకారులపై కేసులు పెట్టడం, ఉద్యమాలను అడ్డుకోవడమంటే నియంతృత్వమే. ఉద్యమకారులపై కేసులు పెడితే సహించేది లేదు.

ముప్పాళ్ల సుబ్బారావు, పౌరహక్కుల సంఘం

వ్యవసాయంలో రైతులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో వ్యవసాయ కూలీలకు అంతే ప్రాధాన్యత ఉంటుంది. వ్యవసాయానికి స్మార్ట్‌మీటర్లు పెడితే ఆ భారం మోయాల్సింది రైతులే. గిట్టుబాటు ధర లేక పంటలు వేయటం మానేస్తున్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తే వ్యవసాయ రంగం బాగుంటుంది. రైతు సమస్యలపై పోరాడే వామపక్షాలను అణిచివేస్తున్నారు. రైతు సమస్యలపై ఎవరూ మాట్లాడకపోతే పరిష్కారం ఎలా వస్తుంది.

చుండూరు రంగారావు, రైతుసంఘం

కృష్ణాజలాల పున:పంపిణీ పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఘర్షణకు కేంద్రం కుట్ర పన్నింది. తెలంగాణ ఎన్నికల కోసమే దీనిని తెరపైకి తెచ్చింది. దీనికి సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వటం సరికాదు. రాష్ట్ర విభజన సందర్భంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయింపులకు ఇది విరుద్ధం. బీజేపీ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలి. పోలవరం ఎత్తు తగ్గించకుండా ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి.

ఆళ్ల గోపాలకృష్ణారావు
సాగునీటి సంఘాల సమన్వయ కమిటీ

కౌలు రైతుల రుణాలు మాఫీ చేయాలి. రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలి. కార్పొరేట్ అనుకూల ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ఉపసంహరించాలి. సమగ్ర ప్రభుత్వ రంగ బీమా సంస్థను ఏర్పాటు చేసి కరువు, వరదలు, పంట సంబంధిత చీడపీడల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు బీమా పథకాన్ని అమలు చేయాలి.

పి.జమలయ్య
ఏపీ కౌలు రైతుసంఘం

ఒక వ్యక్తి మీద కోపంతో ప్రధాని శంకుస్థాపన చేసిన రాజధాన్ని నిలిపేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు రోడ్డున పడ్డారు. రైతుల భూముల ధ్వంసమయ్యాయి. ఉపాధి కరువైంది. ఇప్పుడు ఆ భూములు సాగుకు అనుకూలంగా లేవు. పంటలు, గిట్టుబాటు ధర, కరువు అంశాలు కాకుండా ప్రభుత్వానికి భూమి ఇచ్చినందు వల్లే రైతులకు కష్టాలు వచ్చాయి.

పువ్వాడ సుధాకర్
అమరావతి రాజధాని జేఏసీ

మోదీ విధానాలపై ప్రశ్నిస్తే ఉపా చట్టం బనాయించి జైల్లో పెడుతు న్నారు. వ్యవసాయానికి సంబంధించి మూడు నల్ల చట్టాలు తీసుకు వచ్చినందుకు రైతులు ఉద్యమం చేపట్టారు. దేశంలో జరిగిన సంఘటనలు ప్రజలకు చూపించినం దుకు న్యూస్‌క్లిక్ సంపాదకులు ప్రబీర్ పురకాయస్థను అరెస్టు చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలి. నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలి.

చిట్టిపాటి వెంకటేశ్వరరావు,
ఐఎఫ్‌టీయూ

గతంలో ఉద్యోగులు హక్కుల కోసం డిమాండ్లు పెట్టి ఉద్యమం చేసేవారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులను తొలగిస్తామంటే వద్దని కోరుతూ ఉద్యమాలు చేయాల్సి వస్తుంది. పోరాటాలు చేయకుండా రాజ్యాంగ వ్యవస్థలను శాసిస్తున్నారు. చిన్న ధర్నాకూ అనుమతివ్వటం లేదు. ఇది నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఉంది.

ఎ.విద్యాసాగర్
ఏపీ ఎన్జీవోస్

కోడికత్తి కేసులో మరోసారి విచారణ అవసరం లేదు

సీఎం జగన్ పిటిషన్‌పై ఎన్ఐఏ స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ఎన్నికల(2019)కు ముందు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన కోడి కత్తి కేసు విషయంలో మరోసారి విచారణ అవసరం లేదని ఎన్ఐఏ తేల్చి చెప్పింది. ఏపీ హైకోర్టు లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు ఎన్ఐఏ మంగళవారం కౌంటర్ దాఖలు చేసింది. గతంలో విజయవాడ ఎన్ఐఏ కోర్టులో కోడికత్తి కేసులో కుట్ర దాగి ఉందంటూ...సీఎం జగన్ నాలుగేళ్ల తర్వాత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎన్ఐఏ కోర్టు విచారణ చేపట్టి కొట్టివేసింది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన జగన్... మరో పిటిషన్ దాఖలు చేయగా, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఎన్ఐఏను ఆదేశించింది. ఆ మేరకు ఎన్ఐఏ కౌంటర్ దాఖలు చేసి, ఈ కేసులో కుట్ర కోణం లేదని ఎన్ఐఏ తేల్చి చెప్పింది. మరింత లోతైన దర్యాప్తు అవసరం లేదని కౌంటర్‌లో ఎన్ఐఏ స్పష్టం చేసింది. నిందితుడు ఎయిర్ పోర్టులో వ్యవహరించిన తీరుపై ఎన్ఐఏ సమగ్రంగా వివరించింది. దాడికి ముందు కోడి కత్తి శ్రీను జగన్ వద్దకు వచ్చి 160 సీట్లు వస్తాయని చెప్పిన తర్వాతే దాడికి పాల్పడ్డాడని ఎన్ఐఏ పేర్కొంది. లోతైన విచారణ ఇప్పటికే పూర్తయినందున మరోసారి విచారణ అవసరం లేదని ఎన్ఐఏ తెలిపింది.

కులవ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి ఎనలేనిది

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - విశాఖ : అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళో ద్ధరణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం విశాఖ లోని పూలే విగ్రహానికి సీపీఐ జిల్లా సమితి ఆధ్వ ర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మూర్తి మాట్లాడుతూ నాటి బ్రిటిష్ పాలనలో బహుజనులకు గుర్తింపు తీసుకురావడంలో పూలే విశేష కృషి చేశారని పేర్కొంటూ వారికి విద్యను అందించాలని సంకల్పించిన మొట్టమొదటి వ్యక్తి పూలే అన్నారు. పూలే చేస్తున్న ఈ ప్రయత్నానికి నాటి అగ్రవర్ణాలకు చెందిన వారు కూడా మద్దతు ప్రకటించారని చెప్పారు. నాటి మహనీయులు చేసిన కృషిని వెలుగులోకి తీసుకురావాల్సిన నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అ వైపుగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పేరుకే బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పడమే తప్పితే వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో తీవ్ర వైఫల్యం చెందాయని విమర్శించారు. దళిత మహిళలపై నేటికీ లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని, వాటిని నివరించినప్పుడే పూలే కి నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జి రాంబాబు, సి ఎన్ క్షేత్రపాల్, నాయకులు జి కాసులరెడ్డి, ఎం డి బేగం, జి జయ, యు నాగరాజు, శ్రీనివాస్, బి అశోక్, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోచుకున్న సొమ్మంతా కక్కిస్తాం

అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సంక్షేమం ముసుగులో వైసీపీ పాలక పెద్దలు దోచుకున్న సొమ్మంతా కక్కిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపు తథ్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నోటికొచ్చిన వాగ్దానమల్లా చేసి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. దశలవారీగా మద్యం నిషేధిస్తామని చెప్పిన సీఎం జగన్, ఇవాళ ఏం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. మద్యం తయారీ, అమ్మకాలు సొంతంగా మొదలుపెట్టి డబ్బును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. మద్యం ధరలు పెంచడమే కాదు.. నాసిరకం మద్యాన్ని పంపిణీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. మద్యం దుకాణాల్లో ఎక్కడా డిజిటల్ పేమెంట్స్ లేకపోవడమే అవినీతి పెద్దమొత్తంలో జరుగుతున్నదనడానికి నిదర్శనంగా పేర్కొన్నారు. చంద్రబాబు అమలు చేసిన ఉచిత ఇసుక విధానంపైనా అక్కసు వెళ్లగక్కారు. ఇసుక లభించక లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. ఇక ఆదాయం వచ్చే శాఖల్లో మీ సామాజిక వర్గానికి చెందినవారినే నియమించుకుని, మిగిలిన వారిని ఉత్సవ విగ్రహాల్లా మార్చారని విమర్శించారు. అర్హతలేని వ్యక్తిని టీటీడీ ఈవోగా నియమించారు.

విప్లవకారులందరూ ఏకతాటిపైకి రావాలి

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్ పర్సన్ విమలక్క

విశాలాంధ్ర-చల్లపల్లి: మనువాద, మతతత్వ శక్తులు ఏకమై ప్రజలపై దాడి చేస్తున్న తరుణంలో విప్లవకారులంతా ఏకతాటి పైకి వచ్చి ప్రజలను గెలిపించే దిశగా పోరాటాన్ని ఎక్కుపెట్టాల్సిన అవసరం ఉందని అరుణోదయ సాంస్కృతిక శాఖ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క పిలుపునిచ్చారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతి సభ కృష్ణాజిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. విమలక్క మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరులందరినీ స్మరిస్తూ నవంబరు మాసాన్ని అమరవీరుల మాసంగా జరుపుకోవాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలందరూ ఏకం కావాలని కోరారు. పోరాటాల ద్వారా ప్రజలను ఏకం చేస్తుంటే ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు పార్టీల పేరుతో వారిని విడగొడు తున్నారని విమర్శించారు. పేదలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చే పరిస్థితుల్లో లేరని తెలిపారు. పేదలకు పంచడానికి సెంటు భూమి లేదుగానీ పెద్దపెద్ద కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టడానికి లక్షలాది ఎకరాలు దారాదత్తం చేస్తున్నారన్నారు. 39 ఏళ్ల క్రితం చంద్ర పుల్లారెడ్డి స్థాపించిన ప్రతిఘటన పోరాటంలో అమరులైన వారి ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తొలుత చల్లపల్లిలో అమరుల స్మారక ర్యాలీ నిర్వహిం చారు. స్మారక స్థూపం వద్ద విప్లవ పతాకాన్ని ఆవిష్కరిం చారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, ఏపీ రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు సింగోతు నాగేంద్రం, కొల్లేరు పోరాట నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి, మాల మహా నాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుధీర్, నందేటి శ్రీను, కైతేపల్లి దాస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

డీహెచ్‌పీఎస్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని డిసెంబరు 6న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డీహెచ్‌పీఎస్ పిలుపునిచ్చింది. ఈ మేరకు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని, అదేబాటలో రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రూపొందించిన రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం లేకపోతే బడుగుబలహీన వర్గాల బతుకులు మరింత దారుణంగా ఉండేవని తెలిపారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలను, నేటి సమాజానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి మహిళ అంబేద్కర్ ఇచ్చిన హక్కుల గురించి తెలుసుకోవాలని, తమ హక్కుల అమలు కోసం పోరాటం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి వేడుకల నిర్వహణకు డీహెచ్‌పీఎస్ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ వీసీ అరోరాకు భాస్కర్ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాకు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అత్యున్నతమైనదిగా పేరున్న ప్రతిష్టాత్మక 'భాస్కర్' అవార్డు లభించింది. అంతరిక్ష పరిశోధనల్లో పేరున్న ఇండియన్ సొసైటీ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఎస్ఆర్ఎస్) ఈ అవార్డును ప్రకటించింది. సొసైటీ వార్షిక సమావేశం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం పూనేలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ శైలేశ్ నాయక్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ల చేతుల మీదుగా అరోరా ఈ అవార్డును అందుకున్నారు. రిమోట్ సెన్సింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, ల్యాండ్ కవర్ మ్యాపింగ్ ఎర్త్ సైన్సెస్ రంగాల్లో మనోజ్ అరోరా విశేషమైన సేవలను అందిస్తూ అనేక విజయాలను సొంతం చేసుకున్నారు. ఈ రంగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భాస్కర్ అవార్డును అందజేస్తున్నామని ఇండియన్ సొసైటీ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ప్రకటించింది. ఇప్పటి వరకూ ఈ అవార్డును ప్రస్తుత ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్, మాజీ చైర్మన్లు డాక్టర్ రాధాకృష్ణన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శివన్ వంటి ప్రముఖులు అందుకున్నారు. మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి వివిధ రకాల రిమోట్ సెన్సింగ్ డేటాల ద్వారా కచ్చితమైన ల్యాండ్ కవర్ సమాచారాన్ని గుర్తించడంలో అరోరాకు మంచి అనుభవం ఉంది. కొండ చరియలు విరిగిపడే అవకాశమున్న ప్రమాదకర జోన్లను సరైన సాంకేతికతతో ముందుగానే గుర్తించడంలో ఆయన నిష్ణాతునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఛార్ధామ్ రైల్వే ప్రాజెక్టు, డ్రోన్ సర్వేల్లో జియో స్పేషియల్ పద్ధతులను ఉపయోగించి ఎంతో పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా అరోరాను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ అభినందించారు. దూరదృష్టి గల నాయకునిగా, నిబద్ధత గల పరిశోధకునిగా అభివర్ణించి, డాక్టర్ మనోజ్ నాయకత్వంలో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ రీసెర్చ్ ఇంటెన్సిటివ్ యూనివర్సిటీగా మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో విశేషమైన సేవలందించిన ప్రముఖులతో పాటు తనకు కూడా ప్రతిష్టాత్మకమైన భాస్కర్ అవార్డు లభించడం ఆనందంగా ఉందని అరోరా అన్నారు. తన గురువులు, విద్యార్థులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నానని తెలిపారు.

పురంధేశ్వరికి అభివృద్ధి కనపడదా?: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరికి కనబడటం లేదా అని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తి (జీఎస్డీపీ) చంద్రబాబు హయాంలో (2018-19) కంటే రెట్టింపై రూ.13.2 లక్షల కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోటీ పడి ఏపీ ఐదో స్థానంలో నిలిచిందన్నారు. గతంలో 15వ స్థానంలో ఉండేదని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పురంధేశ్వరి కి కనిపించడం లేదా ? అని ప్రశ్నించారు. జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని, ఇందుకే ఏపీకి సీఎంగా జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. టీడీపీ నాయకుడు లోకేశ్‌ను యువగళం యాత్ర పేరుతో ఎవరు నడవమన్నారో, ఎందుకు పెట్టుకున్నారో తెలియదు గానీ నడక భారమై బిత్తర సవాళ్లు విసురుతున్నాడని విమర్శించారు.

సీహెచ్‌వోలకు బెదిరింపులు

ఆందోళన విరమించి విధుల్లో చేరకుంటే తొలగిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ ఎస్‌సీఎస్ కృష్ణబాబు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20నుంచి దశలవారీ ఆందోళనలు కొనసాగిస్తున్న సామాజిక ఆరోగ్యాధికారుల (సీహెచ్‌వో)పై వైద్య ఆరోగ్యశాఖ బెదిరింపులకు దిగింది. సహేతుకం కాని డిమాండ్లతో ఆందోళన చేస్తున్న సీహెచ్‌వోలు వెంటనే తమ ఆందోళనను విరమించుకుని ప్రజారోగ్య పరిరక్షణ విధుల్లో చేరాలని, లేనిపక్షంలో ఉద్యోగాల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీహెచ్‌వోల నియామకాలను చేపట్టిందని, 2019లో 697 మంది, 2020-22లో 4,519 మంది, 2022-23లో 4816 మంది నియమితులయ్యారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 5 వేల జనాభాకు ఒక ఆరోగ్య ఉపకేంద్రం వుండాల్సి వుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో దాదాపు 2500-3000 మంది జనాభాకు ఒకటి వంతున డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ లను మంజూరు చేసిందని వివరించారు. ఈ క్లినిక్ లలో నియమితులైన సీహెచ్వోలను కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక ఏడాది కాంట్రాక్ట్ పై నియమితులయ్యారని, వారి పనితీరు అంచనా ఆధారంగా ఆ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వీరికి నెలకు రు.25,000 వంతున వేతనంతో పాటు రు.15000 ప్రోత్సాహకాన్ని (మొత్తం నెలకు రు.40,000) వంతున వారి పనితీరు ఆధారంగా అందజేయటం జరుగుతోందని వివరించారు. నియామక సందర్భంలో వీరు ప్రభుత్వంతో కుదుర్చుకున్న వార్షిక ఒప్పంద షరతుల ప్రకారం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ఎటువంటి అశక్తత కారణంగా విధులు నిర్వహించలేకపోయిన జిల్లా ఆరోగ్య సమాఖ్య వేతనాలను నిలుపు చేయటంతో పాటు విధుల నుండి తొలగించే అధికారం కలిగి వుంటుందన్న అంశం అత్యంత ప్రధానమైనదని ఆయన గుర్తు చేశారు. అలాగే పనితీరు అంచనా వేసే కమిటీ వారి పనితీరు ఆధారంగా అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తుందన్నారు. వారు తమకు నిర్దేశించిన విధంగా ప్రధాన కేంద్రంలో అందుబాటులో వుండి పాముకాటు, వడదెబ్బ వంటి అత్యవసర సేవలను అందించాలని, ఇందుకు అదనంగా వారికి కాంట్రాక్ట్ ప్రోత్సాహకంతో పాటు మరో 30 శాతం (రు.4,500) అందించాలని నిర్ణయించిందని, ఈ ప్రకారమే ఇప్పుడు వేతన చెల్లింపులు కొనసాగుతున్నాయని వివరించారు. అయితే సీహెచ్‌వోలు వేతనాలు పెంపు, ఇతర సమస్యలు, ముఖ్యంగా వారి విధులకు అవసరమైన మార్గదర్శకసూత్రాలను జారీ చేయాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ దశలవారీ ఆందోళన కార్యక్రమాలను ఈనెల 20 నుంచి ప్రారంభించారని తెలిపారు. దీనిలో భాగంగా డిసెంబరు 13వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో ధర్నా వంటి కార్యక్రమాల్ని చేపట్టేందుకు నిర్ణయించగా, వారి డిమాండ్లపై ఈనెల 23వ తేదీ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యూనియన్ ప్రతినిధులతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించారని, వేతనాలు, అన్ని రాష్ట్రాల కన్నా అధిక మొత్తంలోనే ఉన్నాయన్న విషయాన్ని వారికి వివరించారని తెలిపారు. ఈ వాస్తవ పరిస్థితులను గమనించి సీహెచ్‌వోలు తక్షణమే ఆందోళన విరమించి, విధుల్లో చేరాలని కృష్ణబాబు సూచించారు. వారు తిరిగి తమ విధుల్లో చేరని పక్షంలో వారి కాంట్రాక్ట్ లను రద్దు చేసి ఉద్యోగాల నుండి తొలగించేందుకు సైతం వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. దీనిపై బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని మొత్తం 10,032 మంది సీహెచ్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, మరోసారి వాస్తవాలు వెల్లడిస్తామని, ఆతర్వాత విధుల్లో చేరకుంటే వైద్య ఆరోగ్య శాఖ వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని కృష్ణబాబు స్పష్టం చేశారు.

కూనమనేని గెలుపు కోసం 50 వేలు విరాళం

విశాలాంధ్ర - తిరుపతి: తెలంగాణ శాసనసభా ఎన్నికలలో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కోటా పురుషోత్తం 50 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఎ రామానాయుడు, తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్‌కు అందజేశారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ - 2023 ఈ నెల 29, 30వ తేదీలలో కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (అప్ కాస్ట్) సభ్య కార్యదర్శి వై. అపర్ణ తెలిపారు. విజయవాడ భవానీపురం లోని అప్ కాస్ట్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాటాడుతూ, పిల్లలు హేతుబద్ధంగా ఉండటానికి, పరిశోధనలు అర్థం చేసుకోవడానికి పరిసరాలలోని స్థానిక సమస్యలను పరిష్కరించడానికి, పరిష్కారాలను వెతకడానికి, శాస్త్రీయ పద్ధతులను వర్తింప చేయడానికి బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా ఉపయోగ పడుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అనుమతితో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

రాష్ట్ర కోటా ప్రకారం 17 ప్రాజెక్ట్ లను జాతీయ స్థాయిలో పాల్గొనే ఈవెంట్ కు ఎంపిక చేస్తామని, ప్రతి జిల్లా నుంచి ఒక ప్రాజెక్ట్ ను ఎంపిక చేసి కేవీఆర్ సైంటిఫిక్ సొసైటీ వారి ఎవాల్యూయేషన్ కోసం పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన, పర్యావరణ, అడవులు, శాస్త్ర సాంకేతిక, గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

'సరైన ఉచ్చారణ' పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ: పుస్తకాలను ఇతర భాషల నుంచి తెలుగులోకి తర్జుమా చేసే క్రమంలో భాషాపరంగా దొర్లుతున్న పొరపాట్లను చక్కదిద్దే ప్రయత్నంలో రచయితలు సత్తి లలితా రెడ్డి, సత్తి సునీల్, సత్తి స్నిగ్ధ సఫలీకృతులయ్యారని ఆచార్య డీవీ సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, మేడా మస్తాన్ రెడ్డి, ఉప్పల అప్పలరాజు అభిప్రాయపడ్డారు.విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక టర్నర్ సత్రంలో "సరైన ఉచ్చారణ" వ్యక్తిత్వ వికాస పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుభాష, సాహిత్యం పట్ల వారికి ఉన్న మక్కువే ఈ రచన అన్నారు. అనంతరం వివిధ రచయితల కథలపై డాక్టర్ నిర్మలా దేవి, బి రాధారాణి, సన్యాసిరావు, సర్వేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ వాస్తవాలకు దగ్గరగా ఒక్కప్పటి కథలు, కథనం ఉండేవని అన్నారు. విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకృష్ణ అధ్యక్షత వహించగా పుస్తక రచయితలు సత్తి లలితా రెడ్డి, సత్తి సునీల్, మధుసూదన్, బండి సత్యనారాయణ, శ్యాంసుందర్, పి ఎ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మూడోసారి గెలుపుపై గంపెడాశ

కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి త్వరలో పదేళ్ల పూర్తి అవుతాయి. అలాగే తెలంగాణలో కె.చంద్ర శేఖర్ రావు (కె.సి.ఆర్.) నాయకత్వంలోని బి.ఆర్.ఎస్. (మునుపటి తెలంగాణ రాష్ట్ర సమితి – టి.ఆర్.ఎస్.) ప్రభుత్వానికి కూడా ఈ నెలాఖరుకు పదేళ్ల పూర్తి అవుతాయి. మూడవ తేదీన వెలువడే ఫలితాలనుబట్టి ఈ ఇద్దరు నాయకులూ మూడోసారి అధికారం చేజిక్కించుకుంటారో లేదో తేలిపోతుంది. 2019 మే 14న మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చింది. టి.ఆర్.ఎస్. ప్రభుత్వం 2014 జూన్‌లో ఏర్పడింది. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని తెలంగాణ ఉద్యమ సమయంలో ఊరించిన కె.సి.ఆర్. వరసగా రెండుసార్లూ తానే ముఖ్యమంత్రిగా ఉన్నారు. మూడవ సారీ తనదే విజయం అని ఆయన అత్యంత విశ్వాసంతో ఉన్నారు. విద్వేష రాజకీయాలు నడిపిన మోదీ ప్రభుత్వంమీద నిరసన బాహాటంగానే వ్యక్తం అవుతోంది. మోదీ భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికలలో గాని తేలదు. తాను అమలుచేస్తున్న రైతు బంధు, 24 గంటల విద్యుత్ సరఫరా వంటివి గట్టెక్కిస్తాయని కె.సి.ఆర్. గట్టిగా నమ్ముతున్నారు. మోదీ వాగ్దాన శూరుడు. కె.సి.ఆర్. మాటల మాంత్రికుడు. బి.ఆర్.ఎస్. శాసనసభ్యులపై బోలెడు అసంతృప్తి ఉంది. అదీగాకా ఈ మధ్య కాలంలో తానే నమ్మలేనంతగా కాంగ్రెస్ అనూహ్యంగా బలపడి గట్టి పోటీఇస్తోంది. కె.సి.ఆర్.కు వారసుడు సిద్ధంగా ఉన్నాడు. తాను జాతీయస్థాయిలో నాయకుడిగా ఎదగాలని కె.సి.ఆర్. ప్రయత్నించారు. బీజేపీకి తాను బద్ధ విరోధి అన్న అభిప్రాయం కలిగిస్తారు. వాస్తవం అది కాదు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద వ్యవసాయచట్టాల లాంటి వాటిని బి.ఆర్.ఎస్. ఎంపీలు పార్లమెంటులో ఎన్నడూ వ్యతిరేకించలేదు. ప్రధానమంత్రి రాష్ట్రానికి వచ్చినా అధికార మర్యాద ప్రకారమైనా ఆయనను కె.సి.ఆర్. కలవరు. ఒక రకంగా భారత రాజకీయాల్లో మోదీ నిర్వహిస్తున్న కీలకపాత్రనే తానూ నిర్వహించాలని కె.సి.ఆర్. కొద్ది నెలల కింద ఆశించారు. దేశంలో మోదీ సర్కారును సవాలు చేయాలని కె.సి.ఆర్. ఎన్నో కలలు కన్నారు. అందుకే టి.ఆర్.ఎస్. పేరును భారతీయ రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్.) గా మార్చేశారు. బి.ఆర్.ఎస్.కు తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనూ ప్రాతినిధ్యం కానీ, వ్యవస్థాపరమైన నిర్మాణంకానీలేదు. జాతీయ స్థాయిలో ఎదగాలన్న ఉద్దేశంతో 2023 జనవరిలో బి.ఆర్.ఎస్. ఖమ్మంలో భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించింది. అప్పుడు కె.సి.ఆర్. ప్రధానోద్దేశం మోదీ సర్కారుకు సవాలు విసరడమే. జాతీయ స్థాయిలో తానే ప్రత్యామ్నాయ నాయకుడిని అని తెలియజెప్పాలని ఖమ్మం ర్యాలీ ద్వారా ప్రయత్నించారు. ఆ ర్యాలీకి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ హాజరయ్యారు. కేరళలో వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ ప్రభుత్వ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా పాల్గొన్నారు. ఈ ర్యాలీ తరవాత కె.సి.ఆర్. మూడో ఫ్రంట్ నాయకుడిగా ఎదుగుతారనిపించింది. ఈలోగా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పట్టుదల వల్ల 26 పార్టీలు కలిసి "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటైంది. కాంగ్రెస్ ఈ ఐక్య సంఘటనకు కేంద్రంగా మారింది. ఈ ఐక్య ఫ్రంట్ ప్రధాన లక్ష్యం విద్వేష రాజకీయాలను అనుసరిస్తున్న మోదీ సర్కారును గద్దె దించడమే. మూడో ఫ్రంట్ నాయకుడిగా ఎదగాలనుకున్న కె.సి.ఆర్. అనుసరించిన రాజకీయ విధానాలు నిజానికి ఆయన బీజేపీకి పరోక్షంగానైనా సన్నిహితుడు అనిపించేట్టుగానే సాగాయి. ఒకప్పుడు బీజేపీ తెలంగాణలో టి.ఆర్.ఎస్. ను ఢీకొనే స్థితిలో ఉంటుందని ఊహించారు. కొద్ది నెలలకింద ఉన్న పరిస్థితి ఇప్పుడులేదు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిద్రాణంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల కుంభకర్ణ నిద్రను వదిలించి మేల్కొల్పింది. కర్నాటకలో విజయం కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చేసింది. కాంగ్రెస్ దృష్టితో చూస్తే తెలంగాణాలో కూడా కాంగ్రెస్ అనూహ్యంగా కొద్ది నెలల కాలంలోనే కె.సి.ఆర్. పార్టీని ఢీకొనే స్థితిలోకి వచ్చినట్టు కనిపిస్తోంది. అందువల్ల కె.సి.ఆర్. పార్టీ మూడోసారి విజయబావుట ఎగుర వేయగలదన్న భరోసాలేదు. అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వంలోని అఖిల భారత మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (మజ్లిస్) తో టి.ఆర్.ఎస్. బంధం ఇప్పటికీ ఫెవికాల్‌తో అతికించినట్టుగానే ఉంది. అందువల్ల శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ విజయంసాధిస్తే కె.సి.ఆర్. పార్టీ భవిష్యత్తూ గందరగోళంలో పడ్తుంది.

అయిదు రాష్ట్రాలలో జరుగుతున్న శాసనసభ ఎన్నికలలో బీజేపీకి ఎదురుగాలి వీస్తోంది. అదే జరిగితే కేవలం ఉత్తరప్రదేశ్‌లో ఉన్న వలుకుబడి ఆధారంగా మోదీ నాయకత్వంలోని బీజేపీ మూడోసారి దిల్లీ పీఠం మీద ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. మోదీ మొదటి సారి అధికారంలోకి వచ్చిన తరవాత ప్రాంతీయ పార్టీలను తెరమరుగుచేసే ప్రయత్నం చేశారు. ఇప్పుడు అదే మోదీ తొమ్మిదేళ్లుగా ఎన్నడూ వినిపించని ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాలను కూడదీయడానికి తాపత్రయ పడ్తున్నారు. వాస్తవం మాత్రం చిన్న పార్టీలు కొన్నింటిని మినహాయిస్తే ఎన్.డి.ఎ. అంటే బీజేపీనే. ప్రాంతీయ నాయకులను విస్మరిస్తే భవిషత్తులో మనుగడ అసాధ్యం అని గుర్తించినందువల్లే ఎన్.డి.ఎ. పక్షాలను మళ్లీ ఐక్యం చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ దేశమంతటా విస్తరించి ఉన్న పార్టీ అయినప్పటికీ ప్రాంతీయ పార్టీలను విస్మరించే స్థితిలో లేదు. "ఇండియా" ఐక్య సంఘటనలో కాంగ్రెస్ పెద్ద పార్టీ కావొచ్చు కానీ అందులో ప్రాంతీయ పార్టీల, నాయకుల పాత్ర గణనీయమైంది. అది మోదీని ఓడించే తారక మంత్రమూ కావచ్చు. కానీ కె.సి.ఆర్. పార్టీ "ఇండియా" ఐక్య సంఘటనలో చేరలేదు. మూడోఫ్రంట్ ఏర్పాటులో భాగంగా అనేక ప్రాంతీయ పార్టీల నాయకులను ఆయన సంప్రదించినా ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. "ఇండియా" మాత్రం సాకారమైంది. ప్రాంతీయ పార్టీలతో కలిసి పనిచేయకపోతే చేయగలిగింది ఏమీలేదన్నతత్వం కాంగ్రెస్‌కూ బోధ పడింది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కనక విజయం సాధిస్తే కె.సి.ఆర్. పార్టీ ఒంటరిగా మిగిలిపోక తప్పదు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ఓ ప్రత్యేక ధోరణి కనిపిస్తోంది. ప్రియాంకా గాంధీ ప్రచారంలో ఇందిరా గాంధీని ఆవాహన చేయడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందిరా గాంధీ 1980లో తెలంగాణలోని మెదక్ నుంచే పోటీ చేశారని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. మూడోసారి గెలవాలన్న కె.సి.ఆర్. ఆశలు ఫలిస్తాయో లేదో వచ్చే మూడవ తేదీన తేలిపోతుంది. మోదీ భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికల్లో గానీ తేలదు. ఎన్నికల ప్రచార సభల్లో కె.సి.ఆర్., మోదీ కాంగ్రెస్ మీదే దాడి చేస్తున్నారు. అంటే బి.ఆర్.ఎస్.కు, బీజేపీకి ఉమ్మడి శత్రువు కాంగ్రెసే.

పది ఉత్తమ వర్శిటీల్లో భారత్‌కు చోటులేదు!

ఆసియా పది ఉత్తమ యూనివర్శిటీల్లో భారత్‌కు స్థానంలేదు. ఉత్తమ ప్రమాణాలు కలిగిన ఆసియా ప్రాంత 25 దేశాలకు చెందిన 856 యూనివర్సిటీల జాబితాలో అత్యధికంగా 148 భారత విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. రెండవ స్థానంలో 133 చైనా విశ్వవిద్యాలయాలు, 3వ స్థానంలో 96 జపాన్ యూనివర్సిటీలు ఉన్నాయని క్యూఎస్ (క్వాక్వరెల్లి సైమండ్స్) సంస్థ నిర్వహించిన "ఆసియా దేశాల యూనివర్సిటీ ర్యాంకింగ్స్ – 2024" జాబితా ప్రకారం భారత్‌కు చెందిన ఐఐటీ బాంబెకు 40వ స్థానం, ఐఐటి దిల్లీకి 46వ, ఐఐటి మద్రాస్‌కు 53వ స్థానం లభించాయి. అలాగే ఐఐఎస్‌సి బెంగుళూరుకు 58, ఐఐటి ఖరగ్‌పూర్‌కు 59, ఐఐటి కాన్పూర్‌కు 63, యూనివర్సిటీ ఆఫ్ దిల్లీకి 94వ ర్యాంకు దక్కాయి. 2023లో విడుదల చేసిన జాబితాలో 118 భారత్‌కు చెందిన యూనివర్సిటీలకు ర్యాంకులు లభించగా, 2024లో 148 యూనివర్సిటీలు చోటు దక్కించుకున్నది.

ఆసియా దేశాల అత్యుత్తమ 10 యూనివర్సిటీల్లో భారతీయ యూనివర్సిటీలు ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం. ఆసియాలోని అత్యున్నత యూనివర్సిటీగా ప్రథమ స్థానం పెకింగ్ యూనివర్సిటీ (చైనా) నిలిచింది. తొలి తొమ్మిది స్థానాల్లో ఆసియా అత్యుత్తమ యూనివర్సిటీలుగా పెకింగ్ యూనివర్సిటీ (చైనా), యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (సింగపూర్), సింగ్వా యూనివర్సిటీ (చైనా), జెజియాంగ్ యూనివర్సిటీ (చైనా), ఫుడాన్ యూనివర్సిటీ (చైనా), యాన్సీ యూనివర్సిటీ (సౌత్ కొరియా), కొరియా యూనివర్సిటీ(సౌత్ కొరియా)లు జాబితాలో ముందున్నాయి. మయన్మార్, కాంబోడియా, నేపాల్‌లకు చెందిన యూనివర్సిటీలు తొలిసారి 2024 ర్యాంకింగ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

"క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024" జాబితా ప్రకారం ఎంఐటీ (యూఎస్), యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ (యూకె), యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ (యూకె), హార్వర్డ్ బిజినెస్ స్కూల్/హార్వర్డ్ మెడికల్ స్కూల్(యూఎస్)/హార్వర్డ్ యూనివర్సిటీ (యూఎస్), స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ (యూఎస్), ఇంపీరియల్ కాలేజ్ లండన్ (యూకె), జూరిచ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్విట్జర్‌లాండ్), నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్(సింగపూర్), యూసిఎల్ లండన్(యూకె), యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా (యూఎస్) తొలి 10 ప్రపంచ అత్యున్నత యూనివర్సిటీలుగా చోటు దక్కించుకున్నాయి. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో 149వ స్థానంలో ఐఐటీ బొంబాయి, 197వ స్థానంలో ఐఐటి దిల్లీ, 225వ స్థానంలో ఐఐఎస్‌సి బెంగుళూరు, 271లో ఐఐటి ఖరగ్‌పూర్, 278లో ఐఐటీ కాన్పూర్, 285వ ర్యాంకులో ఐఐటీ మద్రాస్ లాంటి భారత్‌కు చెందిన యూనివర్సిటీలు ఉన్నాయి. భారత్‌కు చెందిన ఒక్క యూనివర్సిటీ కూడా తొలి 100 స్థానాల్లో చోటు దక్కించుకోకపోవడం విచారకరం.

యూనివర్సిటీ ర్యాంకులు నిర్వహించడానికి క్యూఎస్ సంస్థ ఆయా యూనివర్సిటీలపై నిపుణుల అభిప్రాయాలు, విద్యార్థులు పొందే ప్లేస్‌మెంట్లు, అధ్యాపక విద్యార్థుల నిష్పత్తి, బోధన నాణ్యత, పరిశోధనా పత్రాల నాణ్యత, డాక్టరేటు పొందిన అధ్యాపకులు లాంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంది. 2023 జాబితాతో పోల్చితే 2024 జాబితాలో భారతీయ యూనివర్సిటీల సంఖ్య 118 నుంచి 148 వరకు పెరగడంతో మన యూనివర్సిటీల నాణ్యతా ప్రమాణాలు క్రమంగా పటిష్ట పడుతున్నట్లు విదితమవుతున్నది. భారతీయ యూనివర్సిటీల్లో అకడమిక్ రెప్యుటేషన్, ఎంప్లాయర్ రెప్యుటేషన్ విభాగాల్లో వెనుకబడి ఉన్నప్పటికీ పరిశోధనలు (అధ్యాపకుల పరిశోధనా పత్రాల సంఖ్య), అధ్యాపకుల విద్యార్థులు, డాక్టరేటు పొందిన అధ్యాపకుల సంఖ్య లాంటి విభాగంలో ముందంజలో ఉన్నట్లు తేల్చారు. 2024 జాబితాలో 21 యూనివర్సిటీలు తమ స్థానాలను మెరుగుపరుచుకోగా, 15 యూనివర్సిటీల స్థానాలు మారలేదు. దీనికి తోడుగా 37 భారతీయ యూనివర్సిటీలు కొత్తగా 2024 జాబితాలో చోటు దక్కించుకున్నాయి. భారత దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎస్, స్వల్ప ఇతర యూనివర్సిటీలు మినహా మెజారిటీ ఉన్నత విద్యా సంస్థలు ర్యాంకింగ్స్‌లో వెనుకబడి ఉండడం లేదా జాబితాలో చోటు దక్కించుకోకపోవడం మన యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయి. మన విశ్వవిద్యాలయాలు పరిమాణంలో ముందు, ప్రమాణాల్లో వెనకబడి ఉంటున్నాయని, ముఖ్యంగా వివిధ రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు పేరుకు మాత్రమే నడుస్తున్నాయని, ఇవి నిరుద్యోగులను పెంచడానికి మాత్రమే దోహదపడుతున్నాయని నిపుణులు విశ్లేషించడం చూస్తున్నాం. ఇప్పటికైనా మన దేశీయ విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యాప్రమాణాలతో అంతర్జాతీయ పోటీలో తట్టుకుంటూ ముందు ముందు జ్ఞాన సంపన్న యువభారత నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరుకుందాం.

మధుపాళీ
9949700037

సిల్క్‌యారాలో భద్రతపై అలక్ష్యం

డాక్టర్ అరుణ్‌మిత్ర

పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో, ఫ్యాక్టరీలలో వృత్తి కార్మికులకు భద్రతపట్ల అలక్ష్యం నెలకొనిఉంది. తాజాగా ఉత్తరాఖండ్‌లోని సిల్క్‌యార టన్నెల్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. సొరంగం నిర్మాణంలో కూలిపోయి 41మంది కార్మికులు రద్దు కింద చిక్కుకుపోయారు. ఈ ప్రమాదం జరిగి రెండు వారాలకుపైగా అయింది. అప్పటినుండి కార్మికులను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇలాంటి ప్రాజక్టులు నిర్మాణంలో కార్మికుల భద్రతకు పెద్దగా చర్యలు తీసుకోలేదు. ప్రమాద విషయం తెలుసుకున్న కార్మిక కుటుంబాలు ఆందోళనలో తీవ్ర దు:ఖానికి గురయ్యారు. ఇప్పటికీ కార్మికుల స్థితిగతులు పూర్తిగా వెల్లడికాలేదు. వృత్తికార్మికుల భద్రతకు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్ల ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే చర్యలు తీసుకోలేదని కేంద్ర ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా విమర్శించాయి. ప్రత్యేకించి సిల్క్‌యారలో జరిగిన ప్రమాదం నుంచి కార్మికులను కాపాడేందుకు అవసరమైన బృందాన్ని ఆలస్యంగా కేంద్రం పంపింది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఇతర మార్గాలద్వారా తప్పించుకు నేందుకు తప్పనిసరిగా ఏర్పాట్లు ఉండాలని కార్మికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్టులను నిర్మించే కంపెనీలు, ఏజన్సీలు ఖర్చులు తగ్గించుకుని గరిష్టంగా లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తాయా. న్యూ ఆస్ట్రియన్ టన్నెల్ నిర్మాణ పద్ధతిలో ప్రణాళికాబద్ధ నిర్మాణ విధానం, ఎలా నిర్మించాలన్న ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. సిల్క్‌యార ప్రాజెక్టుకు సంబంధించి రద్దు కింద విషవాయువులు ఉత్పత్తిఅయ్యే అవకాశం ఉందని, ఆ వాయువులను బైటకిపంపే మార్గాన్ని చూడాలని ట్రేడ్‌యూనియన్లు, కార్మికులు కోరుతున్నారు. గతంలో ఇలాంటి ప్రమాదం జరిగినప్పుడు విషవాయువు బైటకు వెళ్లేందుకు పైపులను ఏర్పాటు చేశారని ఇప్పుడు కూడా అదే పనిచేయాలని కార్మికులు కోరుతున్నారు. ఇక్కడ పనిచేసేవారిలో కొద్దిమందికి మాత్రమే వృత్తిపరంగా ఆరోగ్యసేవలు అందుతున్నాయి.

ఎకాలజీ గ్లోబల్ నెట్‌వర్క్ ప్రకారం, ప్రతి సంవత్సరం ఇలాంటి ప్రమాదాల వలన 55.3లక్షల మంది మరణి స్తున్నారు. ఐఎల్‌ఓ అంచనా ప్రకారం, మొత్తం మృతులలో 3.6శాతం వివిధరకాల జబ్బులతో కార్మికులు చనిపోతు న్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు సగంమంది కార్మికులు ఉన్నారని గుర్తించారు. వీరు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యధికంగా దోహదం చేస్తున్నారు. ఈ సంఖ్య ఒక దేశానికి, మరో దేశానికి తేడా ఉన్నది. ఇలాంటి ప్రమాదాలు జరిగిన తర్వాత కొన్ని వ్యాధులకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ప్రపంచ జీడీపీలో నాలుగుశాతం కార్మికుల వృత్తిపరమైన వ్యాధులు, ప్రమాదాలవల్ల ఆదాయం కోల్పోతున్నది. భారత జనాభాలో 97లక్షల మంది ప్రతిఏటా చనిపోతున్నారు. వృత్తిపరమైన ప్రమాదాల మూలంగా మొత్తం ప్రమాదాల్లో 48వేలమంది మరణిస్తున్నారు. ఒక్క నిర్మాణ రంగంలోనే 24.20శాతం మంది ప్రమాదాలతో మరణిస్తున్నారు. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసినట్లయితే మృతులను నివా రించే అవకాశం ఉంటుంది. భారతదేశంలో 54కోట్లమంది కార్మికులు ఉత్పాదకత, అభివృద్ధి ప్రాజెక్టులలో పని చేస్తున్నారు. వీటిలో అత్యధికమంది అసంఘటిత రంగాలలో పనిచేస్తున్నారు. వీరికి ప్రమాదాలు నివారించదగిన భద్రత ఏర్పాట్లు ఉండటంలేదు. 11శాతం కార్మికులకు మాత్రమే సామాజిక భద్రతా పథకాలను అమలు చేస్తున్నారు.

సంబంధిత, అంతర్జాతీయ, కార్మిక నియమనిబంధనల మేరకు కార్మికుల ఆరోగ్యానికి సంబంధించి జాతీయ విధానాన్ని రూపకల్పనచేసి చట్టాలు చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సూచించింది. అలాగే వివిధ రంగాలమధ్య సమన్వయ కార్యకలాపాలకు తగిన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. భిన్న రంగాలలో ఆరోగ్యప్రభావం కూడా భిన్నంగానే ఉంటుంది. గని కార్మికులకు సహజంగా తవ్వేటప్పుడు వెలువడే దుమ్ము, ధూళి వల్ల కలిగే వ్యాధులువేరుగా ఉంటాయి. అణుపరిశ్రమల్లో ధార్మికశక్తికి గురవుతారు. వీరికి అణుధార్మికత నివారణ విధానాలు, చికిత్స, నష్టపరిహారం తప్పనిసరిగా ఇవ్వాలి. విచారకరమైన అంశం ఏమంటే, కార్మికుల ఆరోగ్యభద్రతకు లేబర్ కోడ్ సమర్థమైన చర్యలను సూచించలేదు. ప్రపంచంఅంతటా ఇలాగే ఉన్నదని కేంద్ర ట్రేడ్‌యూనియన్లు విమర్శిస్తున్నాయి. రిజిస్టర్ చేయని సంస్థలలో పనిచేసే కార్మికులకు ప్రతిపాదించిన లేబర్‌కోడ్ భద్రతాచర్యలు తీసుకోవాలని సూచించలేదు. అన్ని వృత్తులలోనే కార్మికులకు ప్రమాదభద్రత చర్యలు తప్పనిసరిగా ఉండాలి.

చార్‌ధామ్ హిందు యాత్రికులకోసం బ్రహ్మకాల్–యమునోత్రి జాతీయ రహదారిపైన ఈ సొరంగాన్ని నిర్మిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని పర్వత ప్రాంతాలలో ఇలాంటి సొరంగాల నిర్మాణం అత్యంత క్లిష్టమైనది. అత్యంత వ్యయంతో కూడిన రక్షణ కార్యకలాపాలను వివిధ ఏజన్సీలు నిర్వహిస్తున్నాయి.

భారతదేశ సైన్యం, ప్రత్యేకత కలిగిన సంస్థలు కూడా ఇందులో పాల్గొంటున్నాయి. ఈ సంస్థలు అనేక టన్నుల పరికరాలను ప్రమాదస్థలానికి చేరవేసేందుకు భారీ విమానాలను నడుపుతున్నారు. ఈ విధంగా అవసరమైన పరికరాలను తరలించేందుకు భారీ విమానాలు అనేకసార్లు తిరుగుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం కార్మికులను కాపాడేందుకు తాను ఎంతకష్టపడుతున్నానోనని ప్రజలకు చెప్పేందుకు 24గంటలు టెలివిజన్ ద్వారా జరుగుతున్న పనులను ప్రసారం చేస్తున్నది. ఈ విధంగా ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రధాన మీడియా ద్వారా ప్రభుత్వం పనిచేస్తున్నది. ప్రధానమీడియా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి అనుకూలంగా మలిచేం దుకు ప్రసారం చేస్తోంది. హిమాలయాలలో పర్యావరణ పరంగా అతి సున్నితమైన ప్రాంతాలలో రోడ్లనిర్మాణం, నిర్మాణ ప్రాజెక్టులను ఎందుకు ఆపివేయటంలేదు? భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘించడం వలన మానవ తప్పిదాలవల్ల పదేపదే ప్రమాదాలు జరుగుతున్నాయి. బలహీనంగా ఉన్న ప్రాంతాలలో కొన్ని జోన్లలో నిర్మాణాలు చేపట్టకూడదు. నిపుణులు అనేకసార్లు హెచ్చరికలు చేసినా వినిపించుకోవడంలేదు. సిల్క్‌యారలో నిర్మాణంపై అనేకసార్లు హెచ్చరించారు. చార్‌ధామ్‌లో వాతావరణ పరిస్థితులమీద అధ్యయనంచేసి తగిన సూచనలు చేయాలని సుప్రీంకోర్టు ఉన్నతాధికార కమిటీని నియమించింది. ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ సొరంగమార్గాన్ని నిర్మించాలన్న నియమనిబంధనలను నిర్మాణకంపెనీ ఉల్లంఘించింది. ఈ ప్రమాదంపై లోతుగా దర్యాప్తుచేయాలి. శక్తివంతమైన బిల్డర్లు తుచ్ఛమైన పద్ధతిలో లాబీచేస్తూ ఉంటారు. సిక్కింలో భారీ మంచుగడ్డ విరిగిపోయింది. అది సిక్కిం ఉత్రా పరిధిలో 12వందల మెగావాట్ల హైడ్రో విద్యుత్‌ప్రాజెక్టు తీస్తా–3ని ఛుంగ్ తంగ్ ప్రాంతంలో తీస్తానదిపై డామ్ నిర్మించారు. ఆ మంచుగడ్డ తీస్తానది ద్వారా పశ్చిమబెంగాల్ వరకు చాలా విధ్వంసం సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రణాళికల రూపకర్తలు, వివిధ రాజకీయపార్టీలు, వాతావరణ శాస్త్రవేత్తలు హైడ్రోపవర్ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం హిమాలయాల్లో సున్నితప్రాంతాలలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ప్రమాదం హెచ్చరిస్తున్నది.

తెలంగాణలో దళిత, ఆదివాసీలు కీలకం

తెలంగాణా శాసన సభ మొత్తం 119 స్థానాలకుగాను 76 స్థానాలలో ఎస్‌సిల జనాభా 15శాతం పైగా ఉన్నారు. 33స్థానాలలో ఎస్‌టిల జనాభా 10శాతంగా ఉంది. మైనారిటీల ఓట్లు 13శాతంగా ఉన్నందున, వివిధ పార్టీల జయాపజయాలను నిర్ణయించడంలో వీరి పాత్ర కీలకం. అందుకే వివిధ పార్టీలు ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీల ఓట్లకోసం ఎన్నో వాగ్దానాలు గుప్పిస్తూ మంచి చేసుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ ఇప్పుడు తెలంగాణపై దృష్టి సారించింది. ఎస్సీలకు ఉపకులాల వారీగా రిజర్వేషన్లు కల్పించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగ రిజర్వేషన్ల సమితి పోరాట సమితి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుపుతున్న పోరాటం తెలిసిందే. చంద్రబాబునాయుడు ప్రభుత్వంచేసిన వర్గీకరణను కొట్టేసిన విషయం విదితమే. ఎస్‌సిలలో మరో ప్రధాన వర్గమైన మాలలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. ఇది రెండు రాష్ట్రాలకే పరిమితమైనది కాదని, ఇతర రాష్ట్రాలనుండి కూడా వర్గీకరణ డిమాండ్లు వస్తున్నందున కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించడానికి ఓ కమిటీని వేసింది. సుప్రీంకోర్టు కూడా ఈ వర్గీకరణ అంశాన్ని పరిశీలిస్తున్నది. ఇటీవల బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణాకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణను వీలయినంత త్వరగా చేయడానికి అవసరమైన చర్యలు కేంద్రం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. బహిరంగ సభలో ప్రధాని మోదీ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కౌగలించుకున్నపుడు ఇద్దరూ ఆనంద భాష్పాలతో ఉద్వేగానికి లోనయ్యారు. కమలం పార్టీ గెలిస్తే బిసిని ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల ప్రణాళికలో కమలనాథులు హామీఇచ్చారు. తెలంగాణాలో రాజ్యాధికారం చేజిక్కించు కోవాలంటే ఎస్సీ ఎస్టీ ఓట్లు కీలకమని గుర్తించిన ప్రధాని మోదీ, అమిత్‌షా ప్రభృతనేతలు వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మొత్తం 119 స్థానాలకు నాలుగోవంతు రిజర్వుడు స్థానాలే. ఎస్‌సి, ఎస్‌టిలు రాష్ట్రమంతటా విస్తరించి ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించడంలో వీరిది కీలకపాత్ర. అన్ని పార్టీలు రకరకాల వాగ్దానాలతో వారికి గాలం వేస్తున్నాయి. ప్రధాన జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు వీరిని ఆకట్టుకోవడానికి ఎన్నో ఆకర్షణీయ వాగ్దానాలు చేస్తుండగా కెసిఆర్ నాయకత్వంలోని అధికార భారత రాష్ట్రసమితి గత పదేళ్లుగా ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి తాము అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి ఊదరగొడుతోంది. కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ళలో ఎస్‌సి, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించి తాము అధికారంలోకివస్తే ఎస్సీ రిజర్వేషన్లను 18శాతానికి, ఎస్టీ రిజర్వేషన్లను 12శాతానికి పెంచుతామని వాగ్దానం చేసింది. ఎస్సీ ఎస్టీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామని, వెనుకబడిన ముస్లింలకు ఇప్పుడిస్తున్న మతపర రిజర్వేషన్లను రద్దుచేసి వాటిని దళితులు, బిసిలు, ఆదివాసీలకు ఇస్తామని గులాబీ పార్టీ ప్రకటించింది. దళితబంధు పేరును "అంబేద్కర్ అభయ హస్తం" గా మార్చి, దళితులు, ఆదివాసీలకు వర్తింపజేస్తామని, కుటుంబానికి సహాయాన్ని రూ 12లక్షలకు పెంచుతామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. ప్రైవేటురంగ విద్యాసంస్థలకు, ప్రైవేటు రంగ పరిశ్రమలలో కూడా రిజర్వేషన్లను విస్తరిస్తామని కూడా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గృహలక్ష్మిని "ఇందిరమ్మ పక్కా ఇళ్ళ" పథకంగా మార్చి తెలంగాణాలోని ప్రతి ఎస్సీ, ఎస్టీకి

స్థలమిచ్చి ఇళ్లు కట్టుకోవడానికి రూ.6లక్షల ఆర్థికసాయం అందజేస్తామని కూడా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మాదిగలు, మాలలు, ఇతర ఎస్‌సి ఉపకులాలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని, ఏటా ఒక్కో కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు కేటాయిస్తామని కూడా చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చారు. ఎస్టీలకు కూడా ఒక్కొక్కటి రూ.500కోట్ల మూలధనంతో 3వేర్వేరు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తామని కోయ, గోండు, ప్రధాన్, అంధ్ తెగలకు తుకారాం ఆదివాసీ కార్పొరేషన్, లంబాడాలకు సంత్ సేవాలాల్ కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. సమ్మక్క – సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తామని కాంగ్రెస్, బీజేపీ రెండూ హామీ ఇచ్చాయి. అయితే దళిత, ఆదివాసీలకు తమ ప్రభుత్వం గత పదేళ్లుగా అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు వారి జీవితాలలో ఎన్నో మార్పులు తెచ్చాయని, వారి ఓట్లు తమకేనని పాలక భారత రాష్ట్ర సమితి ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి రూ.52,893 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించిన విషయాన్ని బిఆర్‌ఎస్ గుర్తుచేస్తోంది. 2,472 గిరిజన తండాలను, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. ప్రభుత్వ విద్యాసంస్థలు, ఉద్యోగాలలో ఎస్సీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారు. జూన్ నుండి పోడు భూములు సాగుచేస్తున్న అర్హులైన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇస్తోంది. ఆదివాసీలకు కూడా "గిరిజన బంధు" పథకాన్ని ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇప్పటికే ప్రకటించారు. 2018 శాసనసభ ఎన్నికలలో 31రిజర్వుడు స్థానాలకుగాను అధికార బిఆర్‌ఎస్ పార్టీ21 స్థానాలు గెలవగా, 19 ఎస్సీ రిజర్వుడు స్థానాలలో బిఆర్‌ఎస్ 16, కాంగ్రెస్ 2, ఎస్టీ రిజర్వుడు స్థానాలు 12కి గాను బిఆర్‌ఎస్ 5 స్థానాలు, కాంగ్రెస్ 2సీట్లు గెలిచాయి. తెలుగుదేశం పార్టీ ఒక ఎస్సీ, ఒక ఎస్టీ స్థానం గెలవగా బీజేపీకి ఒక్క స్థానము దక్కలేదు. ఒక ఎస్టీ స్థానంలో స్వతంత్రుడు గెలిచారు. బిఆర్‌ఎస్ తరఫున 8మంది మాదిగలు, ఐదుగురు మాలలు, ఐదుగురు లంబాడాలు శాసనసభకు ఎన్నికయ్యారు. అయితే ముగ్గురు కోయలు, ఒక గోండు తెగ అభ్యర్థి కాంగ్రెస్ తరఫున ఎన్నిక కావడం విశేషం. ప్రస్తుత ఎన్నికలలో సాంప్రదాయంగా కాంగ్రెస్ మద్దతుదార్లుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు ఈసారి ఎవరిని ఎన్నుకుంటారో వేచి చూడాల్సిందే. మాదిగలు ఈసారి "కమలం" గుర్తుకు ఓటేస్తారని కమలనాథుల ఆశలు ఫలిస్తాయా?.

– పతకమూరు దామోదర్‌ప్రసాద్,
సీనియర్ జర్నలిస్టు 94409 90381

తెలంగాణ ప్రజలకు నమ్మకద్రోహం

కేసీఆర్‌పై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నమ్మకద్రోహం చేశారని కాంగ్రెస్ పార్టీ మంగళవారం విమర్శించింది. కేసీఆర్ వారంటీకి కాలం చెల్లిందని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని జిల్లాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 9 ఏళ్ల తర్వాత కూడా అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితమైంది' అని ఎక్స్ వేదికగా విమర్శించారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, 9 ఏళ్ల తర్వాత కూడా నిరుద్యోగంలో దేశంలోనే తెలంగాణ అధిక రేటింగ్ ఉందని వివరించారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు మినహా ప్రాముఖ్యత గల ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలే లేవన్నారు. సామాజిక లేదన్న కారణంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలకు ప్రభుత్వంలో భాగస్వామ్యమే కల్పించలేదని జైరాం రమేశ్ విమర్శించారు. 9 ఏళ్లుగా తెలంగాణ కేసీఆర్, ఆయన కుమారుడు, అల్లుడు, కుమార్తె చేతిలో బందీగా మారిందని నిందించారు. 'కేసీఆర్‌గారు తెలంగాణ ప్రజలకు నమ్మకద్రోహం చేశారు. కేసీఆర్ వారంటీ ముగిసింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు సమయం వచ్చింది' అని జైరాం రమేశ్ పోస్టు చేశారు.

నిబంధనలు ఉల్లంఘించలేదు

పత్రికల్లో ప్రకటనపై డీకే శివకుమార్

న్యూఢిల్లీ: తెలంగాణ దిన పత్రికల్లో తమ ప్రభుత్వం చేసిన పనుల గురించి ప్రకటనలు ఇవ్వడం నిబంధనలు ఉల్లంఘించడం ఎంతమాత్రం కాదని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం స్పష్టంచేశారు. కర్నాటకకు సంబంధించి తెలంగాణలో తాము ఓట్లు అడగడం లేదని తెలిపారు. తెలంగాణ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంపై ఎన్నికల సంఘం రాసిన లేఖకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పిందని డీకే శివకుమార్ వెల్లడించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఇక్కడ పత్రికలకు కర్నాటక ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడంపై బీజేపీ సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తెలంగాణలో నవంబరు 30వ తేదీన ఎన్నికలు జరుగుతుండగా తెలంగాణ మీడియాలో కర్నాటక ప్రభుత్వం ప్రకటనలు ప్రచురించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రాతినిధ్యచట్టం, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనిపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. తెలంగాణ పత్రికల్లో కర్నాటక ప్రభుత్వం చేస్తున్న పనుల గురించి ప్రకటనలు ఇవ్వవద్దని ఆదేశించింది. ఈ వ్యవహారంపై డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ తాము ఇచ్చిన హామీలేమీ అమలు చేయడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండటంతో...తాము చేసిన పనుల గురించి ప్రభుత్వం యాడ్స్ రూపంలో తెలియజేసిందని చెప్పారు. తాము ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని స్పష్టంచేశారు. కర్నాటక ప్రభుత్వం ఏ ఒక్కరినీ ఓటు అడగలేదన్నారు. అలాంటప్పుడు ఉల్లంఘనలకు తావేలేదని పేర్కొన్నారు. తాము చేసిన పనులను వివిధ రాష్ట్రాల్లోనూ చూపిస్తున్నామన్నారు. అది కర్నాటక కావచ్చు...తమిళనాడు కావచ్చు...తెలంగాణ కావచ్చు...ఎక్కడైనా పత్రికల్లో యాడ్స్ ద్వారా చూపించామని, ఇందులో తప్పేమీ లేదన్నారు. తాము కర్నాటకలో ఓట్ల కోసం ప్రచారం చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం వల్లే తాము అలా చేయాల్సి వచ్చిందని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ కోసమే, ఎక్స్ కోసమే, వై కోసమో తాము ఓట్లు అడగటం లేదని డీకే తెలిపారు.

రాష్ట్రపతికి నూతన ఓటరు ఐడీ కార్డు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త ఓటరు గుర్తింపు కార్డును అందుకున్నారు. మంగళవారం ఇక్కడ రాష్ట్రపతి భవన్‌లో ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి పి.కృష్ణమూర్తి ఆమెకు కొత్త ఓటర్ కార్డును అందజేశారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం అధికారిక ప్రకటనలో తెలిపింది. కృష్ణమూర్తి నవంబర్ 10న రాష్ట్రపతి భవన్‌ను సందర్శించి... ఒడిశా నుండి ఢిల్లీకి ఆమె ఓటరు ఐడీ కార్డు చిరునామాను మార్చుకునే సౌకర్యాన్ని కల్పించినట్లు అధికారులు తెలిపారు. దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రపతికి ఢిల్లీ నుంచి ఓటు వేసే అవకాశం లభించింది.

ఈడీకి మద్రాస్ హైకోర్టు షాక్

చెన్నై: ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ)కి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. తమిళనాడులో అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రశ్నించడానికిగాను తమ ముందు హాజరు కావాలంటూ ఐదు జిల్లాల కలెక్టర్లకు ఈడీ ఇచ్చిన నోటీసులపై హైకోర్టు మంగళవారం స్టే విధించింది. అయితే, అక్రమ ఇసుక తవ్వకాలపై దర్యాప్తు కొనసాగించడానికి అనుమతించింది. కలెక్టర్లకు ఈడీ సమన్లు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రజాపనులశాఖ కార్యదర్శి కె.నంతకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎస్.సుందర్, జస్టిస్ సుందర్ మోహన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. మనీలాండరింగ్ నియంత్రణ చట్టం కింద అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఐదు జిల్లాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నందున ఆ జిల్లాల కలెక్టర్లకు ఈడీ నోటీసులు ఇచ్చింది. రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలపై దర్యాప్తు చేసుకోవచ్చని ధర్మాసనం ఈడీకి స్పష్టంచేసింది. వ్యక్తిగతంగా తమ ముందు హాజరై ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించిన వివరాలు అందించాలని అరియలూర్, వెల్లూరు, తంజావూర్, కరూర్, తిరుచిరాపల్లి కలెక్టర్లకు ఈడీ నోటీసులు ఇచ్చింది. కలెక్టర్ల తరపున ప్రజాపనులశాఖ అధికారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు తదుపరి విచారణను డిసెంబరు 21వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

ఇక్కడ రైతులు అల్లాడుతుంటే...

అక్కడ ఎన్నికల ప్రచారమా?

సీఎం షిండేపై ఉద్ధవ్ నిప్పులు

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మంగళవారం విరుచుకుపడ్డారు. ఓపక్క అకాలవర్షాలకు సొంత రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బంది పడుతుంటే...పక్కరాష్ట్రం తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఏమిటని ఉద్ధవ్ నిలదీశారు. ఉద్ధవ్ ఠాక్రే ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు సమస్యలపై చర్చించడానికి తక్షణమే కేబినెట్ సమావేశం కావాలని, సాధ్యమైనంత త్వరగా రైతులకు సాయమందించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు రాష్ట్రంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, 100 పశువులు సైతం చనిపోయాయని వివరించారు. ద్రాక్ష, ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారని మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. అకాలవర్షాల గురించి వాతావరణశాఖ ముందుగా హెచ్చరించినా రాష్ట్ర కేబినెట్ ఏమి చేసిందని ప్రశ్నించారు. గడచిన మూడు, నాలుగు రోజులుగా కురిసిన అకాలవర్షాలకు మరట్వాడ, విదర్భ, ఉత్తర మహారాష్ట్రలో లక్ష హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు తనకు ప్రాథమిక సమాచారం అందిందని ఉద్ధవ్ చెప్పారు. మహారాష్ట్రలో ప్రభుత్వమే లేదని, అందరూ ప్రచారంలో బిజీగా ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని మార్చే సమయం ఆసన్నమైందని అన్నారు. తన సొంత ఇంటి(రాష్ట్రం)ని చక్కబెట్టుకోవడం కుదరని వాడు పక్క పార్టీ కోసం పక్కింటి(రాష్ట్రం)ని చక్కబెట్టాలనుకోవడం మూర్ఖత్వమని, అలాంటి వాడు ప్రభుత్వాన్ని నడపడానికి పనికిరాడని ఉద్ధవ్ ఘాటుగా విమర్శించారు. అలాంటి వ్యక్తికి అధికారంలో ఉండే అర్హత లేదన్నారు. బీజేపీ కోసం ప్రచారం చేయడానికి షిండే తెలంగాణ వెళ్లారు.

రూ.400 కోట్లతో పాదరక్షల తయారీ పార్కు: స్టాలిన్

చెన్నై: తమిళనాడు ప్రభుత్వం 250 ఎకరాల స్థలంలో రూ.400 కోట్లతో పాదరక్షల తయారీ పార్కును ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ విషయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం వెల్లడించారు. ఈ పారిశ్రామిక ప్రాజెక్టు రాణిపేట జిల్లాలో 20,000 కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుంది. పెరంబలూర్ జిల్లాలోని ఎరైయూర్‌లో రూ.400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన జేఆర్ వన్ ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ పాదరక్షల తయారీ కేంద్రాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం స్టాలిన్ ఆ వ్యాఖ్యలు చేశారు. గత రెండేళ్లలో డీఎంకే ప్రభుత్వం తోలు, పాదరక్షల పరిశ్రమలలో అనేక ప్రాజెక్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. 2022లో పాదరక్షలు, తోలు ఉత్పత్తులపై ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించిన తర్వాత ఈ రంగాల అభివృద్ధి వేగవంతమైందన్నారు. తమిళనాడులో తోలు, పాదరక్షల పరిశ్రమల కోసం 50 ఎకరాల భూమిలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోందని స్టాలిన్ తెలిపారు. కొత్త కర్మాగారాన్ని ప్రారంభించడంపై ఆయన వ్యాఖ్యానిస్తూ... వెనుకబడిన జిల్లాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితాన్ని చూస్తున్నామన్నారు. ఎరైయూర్‌లోని కర్మాగారం ద్వారా సుమారు 20వేల ఉద్యోగాల కల్పన జరిగి పెరంబలూరు, పొరుగు జిల్లాల వారికి ప్రయోజనగం కలుగుతుందని చెప్పారు.

సంజయ్ బెయిల్‌పై సమాధానం ఇవ్వండి

ఈడీని ఆదేశించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం ఆరోపణలకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో బెయిల్ కోరుతూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ దాఖలు చేసిన ఒక పిటిషన్‌కు డిసెంబరు 6లోగా సమాధానం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఢిల్లీ కోర్టు ఒకటి మంగళవారం ఆదేశించింది. సింగ్‌ను తదుపరి కస్టడీలో ఉంచడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్న ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.నాగ్‌పాల్ ఈ పిటిషన్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థకు నోటీసు జారీ చేశారు. అలాగే నిందితులకు సమాధానం కాపీని అందజేయాలని ఈడీని న్యాయమూర్తి ఆదేశించారు. మనీలాండరింగ్ నిరోధక సంస్థ అక్టోబరు 4న సింగ్‌ను అరెస్టు చేసింది. ఇప్పుడు రద్దు చేసిన మద్యం పాలసీని రూపొందించడంలో, అమలు చేయడంలో సింగ్ కీలక పాత్ర పోషించారని, ఇది కొన్ని మద్యం తయారీదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లకు ద్రవ్యపరమైన పరిశీలనల కోసం ప్రయోజనం చేకూరుస్తుందని ఈడీ ఆరోపించింది. అయితే సంజయ్ సింగ్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

విద్యార్థిపై దాడి కేసు జువైనల్ బోర్డుకు...

ఇండోర్ పోలీసుల వెల్లడి

ఇండోర్ : మధ్య ప్రదేశ్‌కు చెందిన ఇండోర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో నాల్గవ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు తమ తోటి విద్యార్థిపై వృత్తలేఖినితో 100 సార్లు కంటే ఎక్కువసార్లు దాడి చేసిన కేసును జువైనల్ జస్టిస్ బోర్డుకు అప్పగించాలని పోలీసులు నిర్ణయించినట్లు ఉన్నతాధికారి మంగళవారం తెలిపారు. పోలీసులు ఈ కేసుకు సంబంధించిన పిల్లల సామాజిక నేపథ్య నివేదికను కూడా సిద్ధం చేసి, బాధితుడి వైద్య పరీక్షల నివేదిక, ఇతర పత్రాలతో పాటు జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరుస్తారని ఆయన చెప్పారు. నవంబరు 24న ఘర్షణ చోటుచేసుకున్న సమయంలో ముగ్గురు విద్యార్థులు తన తోటి విద్యార్థిపై ఒక వృత్తలేఖినితో 100 సార్లకు పైగా దాడి చేసి గాయపరిచారు. కాగా, వీరంతా 10 ఏళ్ల వయస్సు లోపు వారే. ఈ ఘటన వెనుక అసలు కారణమేమిటన్నది స్పష్టంగా తెలియరాలేదు. 'ప్రైవేట్ పాఠశాలలో నాల్గవ తరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు వృత్తలేఖినితో దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణ కేసును జువైనల్ జస్టిస్ చట్టం నిబంధనల ప్రకారం జువైనల్ జస్టిస్ బోర్డుకు అప్పగిస్తాం' అని అదనపు పోలీసు డిప్యూటీ కమిషనర్ అలోక్ కుమార్ శర్మ పీటీఐకి చెప్పారు. ఈ పాఠశాల నగరంలోని ఏరోడ్రోమ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఉంది. పోలీస్ స్టేషన్‌లోని స్పెషల్ జువైనల్ పోలీస్ విభాగం విచారణ అధికారి కేసుకు సంబంధించిన పిల్లల సామాజిక నేపథ్య నివేదికను సిద్ధం చేస్తారని శర్మ చెప్పారు. 'ఈ నివేదిక బాధితురాలి వైద్య పరీక్ష (నివేదిక), ఇతర సంబంధిత పత్రాలతో పాటు జువైనల్ జస్టిస్ బోర్డు ముందు సమర్పించడం జరుగుతుంది' అని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు సంబంధిత పిల్లలు, వారి కుటుంబాలు, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడినట్లు శర్మ తెలిపారు. అయితే చిన్నారుల మధ్య గొడవ, దాడికి గల కారణాలను పోలీసులు వెల్లడించలేదు. దీనిపై ప్రశ్నించినప్పుడు, ఏరోడ్రోమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ రాజేష్ సాహు మాట్లాడుతూ 'ప్రస్తుతం తెలిసినదంతా పిల్లలు తమ తరగతి గదిలో తమలో తాము పోరాడుకున్నారు. నిపుణులతో కౌన్సెలింగ్ తర్వాతే వారి మధ్య గొడవకు గల కారణాలు తేలనుంది. ఈ ఘటనపై బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) కూడా విచారణ చేపట్టిందని ఆయన చెప్పారు. నవంబరు 24న తమ స్కూల్‌లో జరిగిన గొడవలో విద్యార్థి సహవిద్యార్థులు వృత్తలేఖినితో 108 సార్లు దాడి చేశారని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ పల్లవి పోర్వాల్ తెలిపారు. ఈ దాడిలో తన కుమారుడికి లోతైన గాయాలయ్యాయని బాధితుడి తండ్రి తెలిపారు. బాలుడిని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి అక్కడి నుంచి వెళ్లేందుకు అనుమతించారు. 'నా కొడుకు ఇంటికి తిరిగి వచ్చినప్పుడు జరిగిన కష్టాన్ని వివరించాడు. తోటి విద్యార్థులు అతనిని ఎందుకు హింసించారో నాకు ఇప్పటికీ తెలియదు. పాఠశాల యాజమాన్యం తరగతి గదిలోని సీసీ ఫుటేజీని నాకు అందించడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై ఆయన ఇప్పటికే ఏరోడ్రోమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఖుష్బూ నివాసం ఎదుట కాంగ్రెస్ ఆందోళన

చెన్నై: బీజేపీ నేత, సినీనటి ఖుష్బూ సుందర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తమిళనాడులో ఎస్సీ సంఘాలు చెన్నైలోని ఆమె నివాసం ఎదుట ఆందోళన చేపట్టాయి. తన సోషల్ మీడియా పేజీలో చేరి భాష గురించి ఇటీవల ఖుష్బూ వ్యాఖ్యలు చేశారు. దాన్ని ఖండిస్తూ మంగళవారం తమిళనాడులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ విభాగం నిరసన చేపట్టింది. ఆందోళనలో భాగంగా... కుష్బూ ఫ్లెక్సీని చీపుర్లు, చెప్పులతో కొట్టారు. దీంతో ఆందోళన చేస్తున్న ఎస్సీ విభాగం సభ్యుల్ని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ నిరసనను పబ్లిసిటీ స్టంట్‌గా ఖుష్బూ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఏపాటి గౌరవం ఇస్తుందో ఈ ఘటన రుజువు చేసిందన్నారు. ఇటీవల నటి త్రిషపై నటుడు మన్సూర్ అలీ ఖాన్ అనుచిత వ్యాఖ్య చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాఖ్యను ఖండిస్తూ బీజేపీ నేత ఖుష్బూ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ పోస్టు పెట్టారు. ఖుష్బూ ఆ ఘటనపై స్పందించడాన్ని డీఎంకే నేత షణ్ముగం చిన్నరాజ తప్పుబట్టారు. మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగిస్తుంటే బీజేపీ నేతలు ఏం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ వ్యాఖ్యలకు ఖుష్బూ కౌంటర్ ఇస్తూ... మహిళల్ని కించపరిచే రీతిలో మాట్లాడడం తగదని... మీలాంటి చేరి భాష తనకు రాదంటూ పోస్టు చేశారు. చేరి భాష గురించి ఖుష్బూ వ్యాఖ్యానించడాన్ని తమిళనాడు ఎస్సీలు వ్యతిరేకిస్తున్నారు. తమిళనాడు దళిత ఉద్యమ ఎన్జీవో నీలమ్ ఫౌండేషన్ ఖుష్బూను తప్పుపట్టింది. చేరి అనే పదం దళిత మైనార్టీలను సూచిస్తుందని, ఆ పదాన్ని వాడడం అంటే దళితుల్ని అవమానించడమే అవుతుందని నీలమ్ ఫౌండేషన్ ఆరోపించింది.

కీచక ప్రిన్సిపాల్ తొలగింపు

చండీగఢ్: హరియాణాలోని జింద్ జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడ్ని ప్రభుత్వం సర్వీస్ నుంచి తొలగించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆదేశించారు. సంబంధిత డిపార్ట్‌మెంట్ సమర్పించిన దర్యాప్తు నివేదికను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. కాగా ప్రిన్సిపాల్‌పై అభియోగాలను విచారించడానికి జింద్ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటైన లైంగిక వేధింపుల నిరోధక కమిటీ అనేక సంఘటనలలో ఆయన్ను దోషిగా నిర్ధారించింది. ప్రిన్సిపాల్ దురుసు ప్రవర్తనకు వ్యతిరేకంగా అనేకమంది విద్యార్థినులు వాంగ్మూలం ఇచ్చారని తెలిపింది. కేసు తీవ్రత, ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని చర్య (సర్వీసు నుండి తొలగింపు) తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు వెలుగులోకి వచ్చిన వెంటనే... పాఠశాలల కొంతమంది సిబ్బందిని బదిలీ చేయడంతోపాటు పాఠశాలకు ఒక మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించారు. లైంగిక వేధింపుల ఆరోపణలపై జింద్ జిల్లా అధికారులు ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేసిన కొన్ని రోజుల తర్వాత హరియాణా పోలీసులు ఇటీవల పాఠశాల ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేశారు. తొలుత పాఠశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 50 మందికి పైగా బాలికలు ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే విద్యాశాఖ మాత్రం నిందితులను అక్టోబర్ 27వతేదీన సస్పెండ్ చేసింది తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. హరియాణా రాష్ట్ర మహిళా కమిషన్ జోక్యంతో జింద్ పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ నెల మొదటివారంలో అరెస్టు చేశారు.

ఆరోగ్య సిబ్బందికి చట్టబద్ధ రక్షణ

పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ: రోగుల బంధువులు కొన్ని సందర్భాల్లో వైదారోగ్య సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటంతో వారికి చట్టబద్ధ రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవడం అవసరమని కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ సూచించింది. ప్రతిపాదిత మూడు క్రిమినల్ చట్టాలను పరిశీలిస్తున్న బీజేపీ నేత బ్రిజ్ లాల్ నేతృత్వ హోం వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం ఈ అంశాన్ని కూడా పరిశీలించింది. వైద్య, ఆరోగ్య సిబ్బందిపై హింసకు పాల్పడితే అది శిక్షార్హమైన నేరమవుతుందని భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని 115 క్లాజు కింద నిబంధనలను తేవాలని కోరుతూ అనేక వైద్య సంఘాలిచ్చిన వినతులపె చర్చించింది. వైద్య సంఘాల వినతులపై కేంద్ర హోంశాఖ స్పందిస్తూ ఏ వర్గం వారికి కూడా చట్టాల్లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని, చట్టానికి అంతా సమానమేనని నొక్కిచెప్పింది. కేవలం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కోసం ప్రత్యేక నిబంధనలు/చట్టం తెస్తే మీడియా సిబ్బంది, న్యాయవాదులు, బ్యాంకర్లు, సీఏ తదితరులు కూడా దీనిని డిమాండ్ చేయొచ్చు అని పేర్కొంది.

వైద్య సిబ్బందికి దాడులు, హింస నుంచి రక్షణ కల్పించేందుకు 'మెడికల్ ప్రొఫెషనల్స్ యాక్ట్' (వైద్య వృత్తిదారుల చట్టం)ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదించే అవకాశమున్నట్లు కమిటీకి హోంశాఖ తెలిపింది. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత ఆరోగ్య కార్యకర్తలకు చట్టబద్ధ రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేసినట్లు కమిటీ వెల్లడించింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాత్

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇక్కడ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు చాలా బాగున్నాయని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై పనిచేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి చేసిన దానికంటే కూడా అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించడమే ఎక్కువన్నారు. ముఖ్యంగా తెలంగాణలో పేపర్ లీకేజీల కారణంగా నిరుద్యోగులు అనేక అవస్థలు పడ్డారని, చివరకు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఇంతజరిగినా పేపర్ లీకేజీకి బాధ్యులైన వారి పై చర్యలు తీసుకోవడంలో ఇక్కడి ప్రభుత్వం వెనుకబడి పోయిందన్నారు. కాని రాజస్థాన్‌లో ఇలాంటి ఘటనే జరిగితే వెంటనే పేపర్ లీకు కేసులో బాధ్యుల పై కఠినంగా వ్యవహరించామని గుర్తు చేశారు. ఎన్నికల్లో నేరుగా గెలవలేమని గ్రహించే బీజేపీ ఈడీని ప్రయోగించి ప్రతిపక్షాల మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో అవినీతి నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం వంటి అతిపెద్ద ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు ఇప్పటికే తేటతెల్లమైందన్నారు. అయినా తమ తప్పులను కప్పిపుచుకునేందుకు బీఆర్ఎస్ ప్రతిపక్షాల పై ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటన్నారు.

యుగపురుషుడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు: రౌత్

ముంబై: మహాత్మా గాంధీని 'మహాపురుష్'గా, ప్రధాని నరేంద్ర మోదీని 'యుగపురుషుడు'గా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అభివర్ణించిన క్రమంలో శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చరిత్ర, ప్రజలు ఈ అంశాలను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. మంగళవారం రౌత్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మహాత్మాగాంధీని ప్రపంచం గౌరవించిందని అన్నారు. 'పురుషుడు, యుగపురుషుడు మహాపురుషుడు ఎవరో చరిత్ర, ప్రజలు నిర్ణయిస్తారు' అని రౌత్ అన్నారు. సోమవారం జైన ఆధ్యాత్మికవేత్త, తత్వవేత్త శ్రీమద్ రాజ్‌చంద్రాజీ జయంతి కార్యక్రమంలో ధన్‌ఖర్ మాట్లాడుతూ... 'మహాత్మా గాంధీ అహింస ద్వారా బ్రిటిష్ బానిసత్వం నుండి మనల్ని విడిపించారు. భారతదేశ విజయవంతమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మనం ఎప్పుడూ ఉండాలనుకున్న మార్గానికి మనల్ని తీసుకెళ్లారు. నేను మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. గత శతాబ్దపు మహాపురుషుడు మహాత్మా గాంధీ, ఈ శతాబ్దపు యుగపురుషుడు నరేంద్ర మోదీ' అని అన్నారు.

పాఠ్యాంశాల్లో సీపీఆర్ శిక్షణ

తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ : పాఠశాల పాఠ్యాంశాల్లో కార్డియోపల్మోనరీ రెసెస్‌సిటేషన్ (సీపీఆర్) శిక్షణను చేర్చాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీం కోర్టు మంగళవారం నిరాకరించింది. ఇది పూర్తిగా విద్యా విధానానికి సంబంధించిన అంశమని పేర్కొంది. పిల్లలు నేర్చుకోవాల్సిన అనేక అంశాలు ఉన్నాయని, అయితే వాటన్నింటినీ పాఠ్యాంశాల్లో చేర్చాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించలేమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'వారు (పిల్లలు) పర్యావరణం గురించి నేర్చుకోవాలి. పిల్లలు సోదరభావం గురించి నేర్చుకోవాలి. పిల్లలు కార్డియోపల్మోనరీ పునరుజ్జీవనం గురించి నేర్చుకోవాలి. కావాల్సిన ప్రతిదాన్ని చేర్చమని మేము ప్రభుత్వానికి చెప్పలేము... ఇవి ప్రభుత్వం నిర్ణయించాల్సిన విషయాలు' అని కూడా న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రాంచీ నివాసి అయిన పిటిషనర్ తరపున వాదించిన న్యాయవాది, కోవిడ్-19 తర్వాత ఆకస్మిక గుండె ఆగిపోయిన సంఘటనలను ప్రస్తావిస్తూ, ఇది ప్రస్తుత తీవ్ర సమస్య అని పేర్కొన్నారు. 'ఇది ఒక తీవ్ర సమస్య ఎందుకు. చాలా విభిన్న సమస్యలు ఉన్నాయి. మీరు పాఠశాల పాఠ్యాంశాల్లోకి జోక్యం చేసుకోవద్దు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'పిల్లలు ధూమపానం చేయకూడదు. ఇది పూర్తిగా విశ్వవ్యాప్త అంగీకారం. అందువల్ల దీనిని పాఠ్యాంశాల్లో చేర్చడానికి సుప్రీం కోర్టు ఆర్టికల్ 32 రిట్ జారీ చేయాలి' అని పేర్కొంది. సమగ్ర పాఠ్యాంశాలు ఎలా ఉండాలనేది ప్రభుత్వమే నిర్ణయించాలని, ఇది పూర్తిగా విద్యా విధానానికి సంబంధించిన విషయం అని స్పష్టం చేసింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశం విధానపరమైనదని, సూచనలతో సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉంటుందని పేర్కొంది. 'ఇంతకు మించి కోరిన విషయంపై ఆదేశాలు జారీ చేయడానికి కోర్టు మొగ్గు చూపదు. పిటిషన్‌ను పరిష్కరించాం' అని ధర్మాసనం తెలిపింది.

కరువు నివారణ చర్యలేవి ?

ప్రభుత్వ నిర్లక్ష్యంపై రామకృష్ణ, జల్లి విల్సన్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తున్నా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో సంఘ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, పేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి నోచుకోక వారి సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నిటికీ ప్రధాన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలేనని చెప్పారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నివారణకు తీసుకోవల్సిన కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. పైగా సీఎం ధోరణి రాష్ట్రంలో అసలు కరువే లేదన్నట్లుగా ఉన్నదని విమర్శించారు. పేదవారికి భూమే ప్రధాన ఆధారమని, రాష్ట్ర ప్రభుత్వం ఆ భూములకు వారిని ఎలా దూరం చేయాలా? అని ఆలోచిస్తున్నదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని పరిశీలిస్తే పాలకుల నైజం తేటతెల్లమవుతుందన్నారు. ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలవల్ల ప్రభుత్వ భూములకు పేదవారు దూరమై భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు కనపడుతున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అన్ని రకాల ప్రభుత్వభూములు గుర్తించి, ఆ భూములు పేదవారికి చెందేలా పోరాటాలు కొనసాగించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేస్తేనే ప్రభుత్వ భూములు పేదవారికి పంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం తక్షణమే భూ పంపిణీ కార్యక్రమం చేపట్టి అన్ని రకాల ప్రభుత్వ భూముల పంపిణీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావ్ మాట్లాడుతూ కరువు నివారణ, వలసలు ఆపడానికి ఉపాధి హామీ పనులు వెంటనే మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇప్పటికే వలసలు తీవ్రమయ్యాయని, కనీసం గ్రామాల్లో ఉన్న వారికైనా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి వలసల నివారణకు కృషి చేయాలని కోరారు. పేదల స్వాధీనంలో వున్న సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, కరువు, వలసల నివారణకు ఉపాధి హామీ పనులను మొదలుపెట్టాలని, నిరుపయోగంగా ఉన్న అన్ని రకాల ప్రభుత్వ భూములను గుర్తించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులైన పేదవారందరికీ సాగు, నివేశన స్థలాలు ఇవ్వాలని, కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసులను అమలు చేయాలని ఈ సమావేశం తీర్మానాలు ఆమోదిం చింది. ఈ సమావేశం లో బండి వెంకటేశ్వరరావు, బి కేశవరెడ్డి, ఆర్ విజయ, కాబోతు ఈశ్వరరావు,తాటిపాక మధు తదితరులు పాల్గొని వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రస్తావించారు.

నిషేధిత విధానమే కాపాడింది

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్, ఉత్తర కాశీలోని సొరంగంలో చిక్కుకున్న కార్మికులంతా క్షేమంగా బయటకు వచ్చారు. 41 మందిని క్షేమంగా బయటకు తెచ్చేందుకు సహాయక బృందం అనేక ప్రయత్నాలు చేశాయి. భారత్‌తో సహా అమెరికా సాంకేతికతను, అత్యాధునిక యంత్రాలను వినియోగించాయి. కానీ ఏది పనిచేయలేదు. చివరకు నిషేధిత పద్ధతిలోనే 41 మంది ప్రాణాలను కాపాడగలిగాయి. 'ర్యాట్ హోల్ మైనింగ్' ద్వారానే కార్మికులు సురక్షితంగా బయటకు రాగలిగారు. ఆరు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆపరేషన్ జరిగింది. కానీ ప్రమాదకరమైన ర్యాట్ హోల్ మైనింగ్ విధానంతోనే ఆపరేషన్ విజయవంతం కాగలిగింది. అసలు ర్యాట్ హోల్ మైనింగ్ అంటే ఏమిటి? నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్ అంటారు. నాలుగు అడుగుల వెడల్పుతో ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలిగేలా ఈ తవ్వకాలు జరుగుతాయి. ఉత్తర కాశీ ఆపరేషన్‌లో 800 మి.మీ పైపు ద్వారా నిపుణులు లోనికి వెళ్లి తవ్వకాలు చేపట్టారు. చిక్కుకున్న వారికి ఆక్సిజన్ అందించే ఏర్పాటు చేశారు. అత్యంత పలుచటి భూ పొరలు ఉండే మేఘాలయ వంటి ప్రాంతాల్లో చేసే మైనింగ్‌లో ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇతర సాంకేతికతలతో పోలిస్తే ఖర్చు తక్కువగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో దీన్నే ఎంచుకుంటారు. వాస్తవానికి ర్యాట్-హోల్ మైనింగ్‌పై అనేక విమర్శలు, వివాదాలు ఉన్నాయి. ఈ పద్ధతి శాస్త్రీయమైనది కాదని పేర్కొన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2014లో దీన్ని నిషేధించింది. అనంతరం 2015లోనూ ఎన్జీటీ తన నిషేధాన్ని సమర్థించింది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కార్మికులు/ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతుండటాన్ని ప్రస్తావించింది. కాగా కార్మికులను కాపాడేందుకు సొరంగంలో సమాంతర తవ్వకం చేపట్టేందుకు 25 టన్నుల ఆగర్ యంత్రంతో భారీ ఆపరేషన్ చేపట్టినప్పటికీ ... చివరకు ర్యాట్ హోల్ మైనింగ్‌పై ఆధారపడాల్సి వచ్చింది.

కోటాలో ఆగని విద్యార్థుల మరణాలు

నీట్ అభ్యర్థి ఆత్మహత్య

కోట: దేశంలో కోచింగ్ సెంటర్లకు పేరుగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల మరణాలు ఆగడంలేదు. ఆత్మహత్యలను నిరోధించడానికి అధికారులు ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ వరుసగా బలవన్మరణాలు కలవరపెడుతున్నాయి. తాజాగా నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ అభ్యర్థి వక్ఫ్ నగర్ ప్రాంతంలోని తానుంటున్న గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడిని పశ్చిమబెంగాల్‌కు చెందిన 20 ఏళ్ల ఫరీద్ హుస్సేన్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. దీంతో ఈ ఏడాది కోటాలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 28కి చేరింది.పశ్చిమ బెంగాల్‌కు చెందిన హుస్సేన్ నీట్‌కు సిద్ధమవుతున్నాడు. శిక్షణ కోసం గతేడాది నుంచి స్థానికంగా ఓ వసతి గృహంలో ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి భోజనం చేసి తన గదిలోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత గది నుంచి ఎంతకీ బయటకు రాలేదు. అనుమానంతో స్నేహితులు అతడికి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని.. గది తలుపులు తెరిచారు. అక్కడ ఉరి వేసుకుని కనిపించిన ఆ విద్యార్థిని తక్షణమే ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. అయితే, అతని గదిలో ఎలాంటి సూసైడ్ నోట్‌ను పోలీసులు గుర్తించలేదు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

హామీని తుంగలో తొక్కితే

భారీ ఆందోళనే...

- కేంద్రాన్ని హెచ్చరించిన రైతు సంఘాలు
- మూడో రోజూ ధర్నాలు
- గవర్నర్లకు వినతి పత్రాలు
- ముగిసిన రైతు, కార్మిక సంఘాల నిరసనోద్యమం

న్యూఢిల్లీ/చండీగఢ్/మొహాలి: కేంద్రం ప్రభుత్వం హామీని తుంగలో తొక్కితే 'భారీ ఆందోళన' చేపడతామని రైతు సంఘాలు హెచ్చరించాయి. మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన మూడు రోజుల ఆందోళన కార్యక్రమం మంగళవారం మూడో రోజూ కొనసాగింది. చండీగఢ్ సరిహద్దుల్లోని మొహాలి-పంచకుల వద్ద ధర్నా నిర్వహించిన రైతులు పంజాబ్, హరియానా గవర్నర్లతో వారు భేటీ అయిన తర్వాత తమ ఆందోళనలను ముగించారు. అయితే పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్ల పరిష్కారానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మూడో రోజు నిరసనలో పంజాబ్‌కు చెందిన రైతు నాయకుడు హరీందర్ సింగ్ లఖోవాల్ మాట్లాడుతూ 'ఇది ట్రైలర్ మాత్రమే' అని అన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సీరియస్‌గా వ్యవహరించకుంటే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని లఖోవాల్ పీటీఐకి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి కొన్ని డిమాండ్లు ఉన్నాయని, వాటిపై తాము విడిగా తీసుకున్నామని, దీనికి సంబంధించి డిసెంబరు 19న ముఖ్యమంత్రితో సమావేశం కానున్నట్టు తెలిపారు. వివిధ డిమాండ్లపై హరియానాకు చెందిన రైతుల ప్రతినిధి బృందం ఇక్కడ గవర్నర్ బండారు దత్తాత్రేయను ప్రత్యేకంగా కలిసింది. సమావేశం అనంతరం రైతు నాయకుడు సురేశ్ కోత్ విలేకరులతో మాట్లాడుతూ 'ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చకపోతే వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా (ఇప్పుడు రద్దు చేయబడిన) ఆందోళన కంటే పెద్ద ఆందోళనను మీరు చూస్తారు' అని కోత్ అన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దిల్లీలోని సింగు-టిక్రీ సరిహద్దు వద్ద ఒక సంవత్సరానికి పైగా నిరసన దీక్షకు కూర్చొని, దేశ రాజధానికి కీలకమైన ప్రవేశ కేంద్రాలను అడ్డుకోవడం ద్వారా మీడియాలో పతాక శీర్షికల్లో నిలిచారు. దేశ ప్రజల నుంచి విశేష మద్దతు పొందారు. వారి మూడు రోజుల నిరసనలో భాగంగా, పంజాబ్ నుంచి అనేక మంది రైతులు మొహాలీ-చండీగఢ్ సరిహద్దు వద్ద ఆందోళన చేపట్టారు. ఇతర విషయాలతో పాటు కేంద్రం నుంచి పంటలకు కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన హామీని డిమాండ్ చేశారు. హరియానాకు చెందిన మరో రైతుల బృందం కూడా పంచకులలో సమావేశమైంది. పంజాబ్ గవర్నర్‌ను కలవడానికి ముందు, పంజాబ్‌కు చెందిన రైతు ప్రతినిధులు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియాన్‌ను తమ మూడు రోజుల నిరసన చివరి రోజు కలిశారు. సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో అనేక రైతు సంఘాలు ఈ నిరసన చేపట్టాయి. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 2020-21 ఉద్యమ సమయంలో తమపై నమోదయిన కేసులను ఉపసంహరించుకోవాలని, ఆ ఆందోళన సమయంలో మరణించిన రైతుల కుటుంబ సభ్యునికి పరిహారం, ఉద్యోగాలు, రుణమాఫీ, పెన్షన్ కోసం డిమాండ్ చేస్తూ రైతులు పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌ను కలిశారు.

గుర్తించిన ఆ శవాలకు 4లోగా

అంత్యక్రియలు పూర్తి కావాలి

మణిపూర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: మణిపూర్ ఘర్షణ మృతులకు అంత్యక్రియలు జరిపించకుండా, శవగారాల్లో మృతదేహాలను నిల్వవుంచడం సరైన పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. రాష్ట్ర మార్చురీల్లోని మృతదేహాల స్థితిపై సుప్రీంకోర్టు నియమిత రిటైర్డ్ జడ్జి గీతా మిట్టల్ నేతృత్వ హైకోర్టు మాజీ మహిళా జడ్జిలతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికను సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం మంగళవారం పరిశీలించింది. మొత్తం 175లో నుంచి 169 మృతదేహాలను గుర్తించినట్లు నివేదిక తెలిపింది. గుర్తించిన మృతుల్లో 81 మంది కుటుంబాలు వాటిని క్లెయిమ్ చేయగా మరో 88 మృతదేహాలను గుర్తించి నప్పటికీ కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదని వెల్లడించింది. అంత్యక్రియలకు తొమ్మిది ప్రాంతా లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపింది. 'మేలో అల్లర్లు జరిగి చనిపోయిన వారికి ఇంతవరకు అంత్యక్రియలు జరపకుండా ఉంచడం పద్ధతి కాదు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలి' అని ఆదేశాలిచ్చింది. గుర్తించిన మృతుల కుటుంబాలకు అంత్యక్రియలు జరిపించేందుకు నిర్దేశిత తొమ్మిది ప్రాంతాల గురించి సమాచారం ఇవ్వాలని, ఎలాంటి అవరోధం లేకుండా అంత్యక్రియలను జరిగేలా చూడాలని, డిసెంబరు 4వ తేదీ లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మృతదేహాలను గుర్తించినప్పటికీ రాని కుటుంబ సభ్యులకు వారం గడువు ఇవ్వాలని, అప్పటికీ రాకపోతే ప్రభుత్వమే అంత్యక్రియలు జరిపిస్తుందని ప్రకటన జారీచేయాలని సూచించింది. అంత్యక్రియ లప్పుడు శాంతిభద్రతలకు విఘాతం కలకుండా కలెక్టర్, ఎస్పీ చూడాలని తెలిపింది. శవ పరీక్షలప్పుడు డీఎన్ఏ నమూనాలు సేకరించని పక్షంలో అంత్యక్రియలకు ముందు ఆ పని చేయాలని పేర్కొంది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అంశమై సుప్రీం నియమిత కమిటీ నివేదిక సూచనలు ఆధారంగా డిసెంబరు 4న విచారణ జరుగుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. మే 3 నుంచి జరిగిన మణిపూర్ ఘర్షణల్లో 170 మంది చనిపోయిన విషయం విదితమే.

'ప్రచార' పిల్‌ను స్వీకరించం: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రభుత్వ విజయాల ప్రచారానికిగాను అధికారులను వినియోగించడం కోసం కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ జారీ చేసిన లేఖ, డీఓపీటీ కార్యాలయ ప్రకటన రద్దునకు దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. "ప్రచార" ప్రయోజన వాజ్యాన్ని స్వీకరించమని న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు జస్టిస్ బీవీ గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. రాబోయే ఎన్నికల్లో లబ్ధి కోసం తమ విజయాలను ప్రభుత్వ అధికారుల ద్వారా పాలక పక్షం ప్రచారం చేయించుకోవడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని భూషణ్ వాదించారు. కానీ పిల్‌ను స్వీకరించేందుకు ధర్మాసనం విముఖత చూపింది. దీనిపై హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచిస్తూ పిల్‌ను కొట్టివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది.

చేతివేళ్లు తెగిపోతున్నాయ్

మహిళా కార్మికులకు భద్రత కరువు: ఆటో రంగంపై ఎస్ఐఐ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశ కార్మికశక్తిలో మహిళలు సగభాగంగా ఉన్నారు. అయితే వారికి పనిప్రదేశాల్లో భద్రత కరువవుతోంది. ముఖ్యంగా ఆటో రంగంలో పనిచేసే మహిళా కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. సరైన భద్రతా, శిక్షణ లేకుండా తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవు తున్నారు. యంత్రాలతో పనిచేస్తూ చేతివేళ్లు పోగొట్టుకుంటున్నారు. యజమానులు, కాంట్రాక్టర్లు లేక ఇతర పరిస్థితుల వల్ల తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఈమేరకు భారతీయ ఆటో రంగ కార్మికుల భద్రతపై వెలువడిన వార్షిక నివేదిక ద్వారా తెలుస్తోంది. పనిచేసేటప్పుడు మహిళల చేతి వేళ్లు నలిగిపోవడం, తెగిపోవడం వంటివి జరుగుతుండగా, హరియాణా, మహారాష్ట్రలో ఇలా గాయపడుతున్న వారి సంఖ్య వేలల్లో ఉన్నట్లు 'ది సేఫ్ ఇన్ ఇండియా ఫౌండేషన్' నివేదిక వెల్లడించింది. ఏటా ఆటో రంగ సరఫరా గొలుసులో జరిగే ప్రమాదాలు, కార్మికులకు గాయాలపై ఈ నివేదిక రూపొందింది. హరియాణాలోని ఫరీదాబాద్‌లోని మహిళా కార్మికుల సమస్యలు, అధిక పని ఒత్తిడి, ప్రాణాలకు భద్రత లేకపోవడం, ఈఎస్ఐసీ కార్డులు కల్పించకపోవడం, పురుషుల కంటే తక్కువ వేతనాలు ఉండటం వంటి అంశాలను ఆటో పరిశ్రమలకు రాసిన లేఖలో ప్రస్తావించింది. 'ఇన్ని కష్టాలు ఉన్నాగానీ మా పిల్లలకు మంచి విద్య, భవిష్యత్ ఇవ్వడం కోసం పనికి వెళ్లడం మాలాంటి వేలాది మంది మహిళలకు అనివార్యం. గాయాల బారిన పడే పరిస్థితి లేకుండా, ప్రమాదాలు తగ్గించేందుకు మా భద్రతపై దృష్టి అవసరం. మా సమస్యలు అర్థం చేసుకొని పని పరిస్థితుల్లో మార్పు తేగలరని, సమాన పనికి సమాన వేతనం కల్పించగలరని ఆకాంక్షిస్తున్నాం' అని లేఖ పేర్కొంది. ది సేఫ్ ఇన్ ఇండియా ఫౌండేషన్ (ఎస్ఐఐ) ఐదవ వార్షిక 'క్రష్డ్' నివేదికలో ఈ అంశాలు ప్రధానంగా పేర్కొన్నారు. కాగా జీడీపీలో 7.1శాతాన్ని ఆటో రంగం సమకూరుస్తోంది.

37 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంది. చాలా మంది రెండు వేళ్లను పోగొట్టుకున్న వారు ఉన్నట్లు నివేదిక తెలిపింది. మారుతీ సుజుకీ, హోండా, టాటాతో సహా 10 టాప్ సంస్థల సరఫరా గొలుసుల్లోని కార్మికులు గాయపడుతున్నారని ఎస్ఐఐ నివేదిక తెలిపింది. చాలా వరకు ప్రమాదాలు నమోదు కావడం లేదని పేర్కొంది. 2020 నుంచి డేటా విడుదల కాలేదని వెల్లడించింది. 2020లో హరియాణాలో వెయ్యి మందికిపైగా కార్మికులు గాయపడినట్లు 'క్రష్డ్' గుర్తించింది. అయితే 68 మాత్రమే నమోదైనట్లు పేర్కొంది.

యూపీలో ముస్లిం ఎమ్మెల్యేకు అవమానం

ఆలయానికి వెళ్లినందుకు శుద్ధి చేసిన హిందుత్వవాదులు

సిద్ధార్థనగర్(యూపీ): బీజేపీ పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో ఓ ముస్లిం ఎమ్మెల్యేకు అవమానం జరిగింది. తాను సందర్శించిన ఆలయాన్ని హిందూ మతోన్మాదులు గంగాజలంతో శుద్ధి చేశారు. ఓ ప్రజాప్రతినిధి పట్ల ఇంతటి వివక్ష ప్రదర్శించడం మరింత అమానుషం. ఈ ఘటన యూపీలోని సిద్ధార్థనగర్‌లో చోటుచేసుకుంది. దూమరియా గంజ్ ఎమ్మెల్యే సయ్యదా ఖాతూన్ స్థానికుల ఆహ్వానం మేరకు ఆదివారం సమయ్ మాతా ఆల యాన్ని సందర్శించారు. సమయ్ మాతా ఆలయం లో సచ్చంది మహాయజ్ఞంలో పాల్గొనేందుకు సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఖతూన్‌ను స్థానికులు ఆహ్వానించారు. ఆమె వచ్చి వెళ్లిన తర్వాత... ఎమ్మెల్యే ఆలయానికి రావడం ఇష్టంలేని కొంతమంది మంత్రోఛారణతో గంగాజలంతో శుద్ధి చేశారు. ఆలయశుద్ధికి బదానీ ఛిఫా నగర్ పంచాయతీ సర్పంచ్ ధర్మరాజ్ వర్మ నేతృత్వం వహించారు. ఆలయంపై ఎలాంటి హక్కులేని కొంతమంది ఎమ్మెల్యేను ఆహ్వానించారని ధర్మరాజ్ వర్మ చెప్పారు. సయ్యదా ఖాతూన్ ఓ ముస్లిం అని, ఆమె ఆవు మాంసం తింటుందని, అందుకే ఆమె రాకతో ఆలయం అపవిత్రమైందని ఆయన చెప్పారు. శుద్ధి చేయడంతో ఆలయానికి పూర్తి పవిత్రత ఏర్పడిందన్నారు. ఇక పూజలు చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని ఆయన హెచ్చరించారు. దీనిపై సయ్యదా ఖాతూన్ లక్నో నుంచి పీటీఐతో మాట్లాడుతూ తాను ప్రజాప్రతినిధినని, అన్ని మతాలకు చెందిన ఆలయాలు, చర్చిలు, మసీదులకు వెళతానని, తనను ఎవరూ ఆపలేరని స్పష్టంచేశారు. ఆ ప్రాంతంలో చాలామంది బ్రాహ్మణులు, సంతులు తనతో చాలా సఖ్యతతో ఉంటారని, పది రోజుల క్రితమే సమయ్ మాతా ఆలయానికి తనను ఆహ్వానించారని ఆమె చెప్పారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, ఈ ప్రాంతం మొత్తానికి తాను ఎమ్మెల్యేనని, తనను ఎవరు ఆహ్వానించినా వెళతానని తేల్చిచెప్పారు. ఈ ప్రాంతంలో అనేక ఆలయాల పునరుద్ధరణకు ఆమె సాయమందించారు. వర్మ ఓ ప్రజాప్రతినిధి అని, ఆయన బీజేపీ నాయకుడని చెప్పారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించిన హిందూ యువవాహిని సభ్యుడని తెలిపారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం: జేడీయూ

పాట్నా: సామాజికంగా అణగారిన కులాలకు రిజర్వేషన్లు పెంచడం బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదని, అందుకే రిజర్వేషన్ల పెంపునకు వ్యతిరేకంగా పాట్నా హైకోర్టులో కాషాయపార్టీ పిటిషన్ దాఖలు చేసిందని జేడీయూ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ లలన్ విమర్శించారు. రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టులో ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలైందని, త్వరలోనే దీనిపై విచారణ జరగవచ్చని వార్తలు వస్తున్న నేపథ్యంలో లలన్ ఈ ప్రకటన చేశారు. 'అంతా బీజేపీయే చేసింది. రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ తన మద్దతుదారులతో హైకోర్టులో పిటిషన్ వేయించింది. అయితే బీజేపీ కుట్ర విఫలమైంది. ఈబీసీలకు కోటా ప్రకారమే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి' అని లలన్ ఇక్కడ విలేకరులకు చెప్పారు. నితీశ్ కుమార్ ప్రభుత్వం ఆదేశించిన కుల సర్వేను దెబ్బకొట్టేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నించిందని, దానిపైనా తన మద్దతుదారులతో బీజేపీ పిటిషన్ వేయించిందని, కానీ విఫలమైందని గుర్తుచేశారు. సర్వేను సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పదిశాతం సహా 75శాతం రిజర్వుడు సీట్లు కేటాయిస్తూ ఇటీవల ఆమోదించిన చట్టానికి కోర్టు అంగీకరిస్తుందని జేడీయూ అధినేత ఆశాభావం వెలిబుచ్చారు. ఇదిలావుండగా రిజర్వేషన్‌ల పెంపునకు వ్యతిరేకంగా పాలక మహాఘట్‌బంధన్ తరపు హైకోర్టులో పిటిషన్ దాఖలైందని బీజేపీ సీనియర్ నేత సుశీల్‌కుమార్ మోదీ ఎదురుదాడికి దిగారు. తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడానికే ఇలా చేశారని నిందించారు. 1970లోనే బీహార్‌లో మొదటిసారి ఓబీసీ కోటాను ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. నాడు ప్రభుత్వంలో జనసంఘ్ భాగస్వామిగా ఉందని, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉందని తెలిపారు.

మోర్బిలో దళితుడిపై దాడి కేసులో

ముగ్గురు నిందితుల లొంగుబాటు

వారి బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన కోర్టు

న్యూఢిల్లీ: గుజరాత్, మోర్బిలో దళితుడిని వేధించిన కేసులో ఐదుగురిలో ముగ్గురు నిందితులు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిందితులు విభూతి పటేల్ (27), ఆమె సోదరుడు ఓం పటేల్ అలియాస్ ఓం సితాపారా (21), ఆమె వ్యాపార భాగస్వామి రాజ్ పద్మాలా (23) మోర్బీ డీఎస్పీ (ఎస్టీ-ఎస్సీ సెల్) ప్రతిపా సిన్హా జిలా ఎదుట లొంగిపోయారు. మరొక నిందితుడు మయూర్ కరోటారా అలియాస్ డీడీ రబారీ అరెస్టుతో పాటు తమ ముందస్తు బెయిల్ పిటిషన్లను స్థానిక కోర్టు తిరస్కరించడంతో ఆ ముగ్గురూ లొంగిపోయారు. మహిళా వ్యాపారవేత్త విభూతి పటేల్, ఉద్యోగులు కొందరు కలిసి ఆమె కంపెనీలో పనిచేసే దళితుడిని వేధింపులకు గురిచేశారు. అతనిని బెదిరించి ఆమె చెప్పులను నాకేలా చేశారు. కంపెనీ కోసం పనిచేసినందుకు జీతం అడిగిన కారణంగా అతనితో అమానవీయంగా ప్రవర్తించారు. ఈనెల 22న రాణిబా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఐపీఎల్) వద్ద దళితుడు నిలేశ్ దాల్సానియా (21), అతని సోదరుడు మేహుల్, పొరుగువారైన భావేశ్ మఖ్వానాపై దాడి జరిగింది. 23న ఏ డివిజన్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అక్టోబరు 2 నుంచి 18వ తేదీ వరకు చేసిన పనికిగాను 16రోజుల జీతం కోసం ఆఫీసుకు వెళ్లిన నీలేశ్‌పై యజమానులు దాష్టీకానికి ఒడిగట్టారు. తన కాళ్లకు మొక్కాలని, తన చెప్పులు నాకుతూ క్షమాపణ చెప్పాలని నిలేశ్‌ను విభూతి బలవంత పెట్టినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. అతని వద్ద ఉన్న రూ.500, స్మార్ట్‌వాచ్‌ను కూడా లాక్కున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిలేశ్‌ను లిఫ్ట్‌లో నుంచి టెర్రెస్‌పైకి లాక్కెళ్లి బెల్ట్‌తో కొట్టారని, కాళ్లతో తన్నారని వైబ్స్ ఆఫ్ ఇండియా నివేదించినట్లు కూడా ఎఫ్ఐఆర్ తెలిపింది. ఈ వ్యవహారంలో ఐదుగురి మీద ఐపీసీ, ఎస్టీ, ఎస్సీ దురాగతాల నివారణ చట్టంలోని అనేక సెక్షన్ల కింద కేసు నమోదైంది.

సీజేఐ కోర్టులో విదేశీ ప్రధాన న్యాయమూర్తులు

విచారణ కార్యకలాపాల పరిశీలన

న్యూఢిల్లీ : ఘనా, దక్షిణ సూడాన్, ఐవరీ కోస్ట్ సహా అనేక దేశాల నుంచి వచ్చిన ప్రధాన న్యాయమూర్తులు మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కోర్టులో కూర్చొన్నారు. దాదాపు 30 నిమిషాల పాటు సుప్రీం కోర్టు కార్యకలాపాలను చూశారు. సీజేఐ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఉదయం సమావేశమైన వెంటనే, జస్టిస్ చంద్రచూడ్ ఈ దేశాల ప్రధాన న్యాయమూర్తులను స్వాగతించారు. 'బార్ సభ్యులారా, అంతర్జాతీయ సదస్సు కోసం విదేశాల నుంచి వచ్చిన ప్రధాన న్యాయమూర్తులను స్వాగతించడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని సీజేఐ అన్నారు. 'మేము ఐవరీ కోస్ట్, దక్షిణ సూడాన్, కిర్గిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కామెరూన్, బోట్స్వానా, ఘనా నుంచి వచ్చిన మన సహోద్యోగులను స్వాగతిస్తున్నాము' అని ఆయన అన్నారు. దాదాపు అరగంట తర్వాత సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం రెండు నిమిషాలు లేచి... 'విదేశాల నుంచి వచ్చిన మన సహోద్యోగులు రెండు, మూడు, నాలుగు, ఐదు కోర్టులకు వెళుతున్నారు. అందువల్ల మేము వారిని బయటకు తీసుకువెళ్లి, రెండు నిమిషాలలో తిరిగి వస్తాము' అని తెలిపారు. కాగా తర్వాత వారు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనాలతో సహా సందర్శించిన కొంతమంది ప్రధాన న్యాయమూర్తులు కోర్టులలో కూర్చున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO, RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.